



ఫిల్టర్ పాయింట్



ఆదోని మండలం నాగనాథనహళ్లి సమీపంలోని ఆస్పరి రక్షిత మంచినీటి పథకం

తాగునీరు సరఫరాలో అవినీతి జలగలు..!

- ఇష్టారాజ్యంగా ఎం-బుక్ రికార్డు నమోదు
- కాంట్రాక్టర్లపై వేధింపులు
- నిర్వహణ పేరిట నిధులు స్వాహా
- ఆస్పరి సీపీడబ్ల్యూఎస్ స్కీం అస్తవ్యస్తం

కర్నూలు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): సమగ్ర రక్షిత మంచినీటి సరఫరా (సీపీడబ్ల్యూఎస్) పథకాలు కాంట్రాక్టర్లు, కొందరు అధికారులకు ఆదాయ వనరులుగా మారాయి. నిర్వహణ పేరిట ప్రజాధనం ఇష్టారాజ్యంగా ఖర్చు చేస్తున్నారు. గ్రామీణ ప్రజలకు సరఫరా చేసిన తాగునీటి కంటే ఎక్కువ నీటిని అందించామని ఎం-బుక్‌లో నమోదు చేసి ప్రజాధనం కాజేస్తున్నారు. సరఫరా చేసిన నీటికే బిల్లులు ఇవ్వండి.. ఒక్కపైసా కూడా వద్దు..! అన్నందుకు ఓ కాంట్రాక్టరు బిల్లులు ఇవ్వకుండా కొందరు ఇంజనీర్లు వేధిస్తున్నారు. అంతేకాదు అవసరం లేకున్నా ఎయిర్‌వాల్స్ కొనుగోలు చేసి ప్రజాధనం నీళ్లప్రాయంగా వెచ్చిస్తున్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన చర్యలు శూన్యం. మరో పక్క రెండేళ్లుగా నిర్వహణ నిధులు ఇవ్వకపోవడంతో నిర్వహణ సిబ్బందికి జీతాలు అందక అర్ధాకలితో అలమటిస్తున్నారు. జిల్లాలో ఆస్పరి సీపీడబ్ల్యూఎస్ స్కీం నిర్వహణ తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో గ్రామీణ తాగునీరు సరఫరా పారిశుధ్యం శాఖ పర్యవేక్షణలో 60 సమగ్ర రక్షిత మంచినీటి సరఫరా (సీపీడబ్ల్యూఎస్) పథకాలు ఉన్నాయి. వాటి ద్వారా సుమారుగా 850 గ్రామాలకు శుద్ధి చేసిన (ఫిల్టర్) తాగునీరు అందిస్తున్నారు. వీటి నిర్వహణ కోసం ప్రభుత్వం ఓ అండ్ ఎం గ్రాంట్ కింద ఏటేటా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంది. అందులో భాగంగానే ఉమ్మడి జిల్లాలో సీపీడబ్ల్యూఎస్ స్కీంల నిర్వహణ కోసం రూ.85.71 కోట్లు జిల్లా పరిషత్ (జడ్పీ) అధికారులు పరిపాలన అనుమతులు ఇచ్చారు. ఆ నిధులతో విద్యుత్ బిల్లుల కోసం రూ.40.88 కోట్లు, స్కీంల నిర్వహణ, తాత్కాలిక మరమ్మతులు, సిబ్బంది జీతాలు కోసం రూ.44.83 కోట్లు కేటాయించారు. వీటి నిర్వహణ బాధ్యతలు టెండర్ల ద్వారా కాంట్రాక్టర్లకు అప్పగిస్తారు. ఆయా సీపీడబ్ల్యూఎస్ స్కీంల ద్వారా గ్రామాలకు శుద్ధి చేసిన తాగునీరు అందిస్తే కిలో లీటరుకు రూ.6.24 చెల్లిస్తారు. రోజు వారీగా ఏ గ్రామానికి ఎంత నీటిని సరఫరా చేశారో ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎం-బుక్ రికార్డులు చేసి బిల్లులు చెల్లించాలి. కాంట్రాక్టరు తక్కువ నీటిని సరఫరా చేసినా.. ఎక్కువ నీటిని సరఫరా చేసినట్లు ఎం-బుక్ రికార్డు చేసి నిధులు స్వాహా చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కర్నూలు జిల్లాలో 32 సీపీడబ్ల్యూఎస్ స్కీం ద్వారా 360 గ్రామాలకు ఫిల్టర్ చేసిన తాగునీరు అందించాలి. ముఖ్యంగా ఆదోని డివిజన్ పరిధిలో గత వైసీపీ ప్రభుత్వంలో రాజకీయ నాయకులు, స్థానిక అప్పటి ఎమ్మెల్యేల అండతో తాగునీటి పథకాలు నిర్వహణ పేరిట నిధులు ఇష్టారాజ్యంగా ఖర్చు చేశారనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. సరఫరా చేసిన నీటికే బిల్లులు ఇవ్వాలనే కాంట్రాక్టర్లను ఇంజనీర్లు వేధిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు.



ఓహెచ్ఆర్ ట్యాంక్

ఎంత నీటికి అంతే బిల్లు ఇవ్వమందుకు..!

ఆదోని డివిజన్ పరిధిలో ఆస్పరి సమగ్ర రక్షిత మంచినీటి పథకం ద్వారా ఆదోని, ఆస్పరి, ఆలూరు మండలాల్లో 19 గ్రామాలకు ఆదోని మండలంలోని నాగనాథనహళ్లి గ్రామ సమీపంలో నిర్మించిన ఎస్ఎస్ ట్యాంక్ నుంచి శుద్ధి (ఫిల్టర్) చేసిన తాగునీరు సరఫరా చేయాలి. ఈ స్కీం నిర్వహణ కోసం విద్యుత్తు బిల్లులకు రూ.1.25 కోట్లు, సిబ్బంది జీతాలు, మరమ్మతులు వంటి వాటి కోసం రూ.82.30 లక్షలు కలిపి రూ.2.07 కోట్లు కేటాయించారు. 2023 ఫిబ్రవరి 13 నుంచి మార్చి 31వ తేది వరకు 42 రోజులకుగాను అప్పటి కాంట్రాక్టరు 67,896.75 కిలో లీటర్లు తాగునీరు సరఫరా చేశారు. కిలో లీటరుకు రూ.6.24 ప్రకారం రూ.4,23,675 చెల్లించాల్సి ఉంది. అయితే.. ఆ స్కీంను పర్యవేక్షించే ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరు 83,274.72 కిలో లీటర్లు నీటిని సరఫరా చేశారని, అందుకు గానూ రూ.5,19,634 చెల్లించాలని ఎం-బుక్ రికార్డు చేశారు. అంటే సరఫరా చేయని 15,377.97 కిలో లీటర్ల నీటికి సరఫరా చేసినట్లు రికార్డుల్లో చూపించి రూ.95,958 ఎక్కువ బిల్లు చేశారు. అదనపు డబ్బు నాకు అక్కర్లేదు.. ఎంత నీటిని సరఫరా చేశానో అంతే నీటికి లెక్కకట్టి బిల్లులు ఇవ్వాలని కాంట్రాక్టరు రామనారాయణ గుప్త అధికారులను కోరాడు. ఎక్కువ నీటిని సరఫరా చేసినట్లు రికార్డు చేసిన ఎం-బుక్‌లో సంతకం చేయనన్నందుకు కక్షగట్టి ఈ రోజు వరకు తనకు బిల్లులు ఇవ్వకుండా వేధిస్తున్నారని ఆ కాంట్రాక్టరు ఆరోపిస్తున్నాడు. న్యాయంగా బిల్లులు ఇవ్వమనడం తప్పా..? అని ప్రశ్నిస్తున్నాడు. ఒక్క స్కీంలోనే 42 రోజులకే ఈ స్థాయిలో సరఫరా చేయని నీటిని సరఫరా చేసినట్లు దాదాపు రూ.లక్ష స్వాహా చేసేందుకు ఇంజనీర్లు ఎం-బుక్ రికార్డు చేశారంటే.. మొత్తం నీటి పథకంలో ఏ స్థాయిలో అవినీతి జరిగి ఉంటుందో..? మరి.



ఎస్ఎస్ ట్యాంక్ వద్ద పంపు సెట్లు

సీపీడబ్ల్యూఎస్ స్కీం ఓ అండ్ ఎం బాధ్యతలను కాంట్రాక్టర్లకు నామినేషన్‌పై ఇస్తున్నారు. అందులో భాగంగా ఆస్పరి స్కీంను కూడా గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ ఎమ్మెల్యే సిఫారసు మేరకు ఓ వైసీపీ నాయకుడికి ఇచ్చారు. ఆయన నెలనెల ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులతో అగ్రిమెంట్ (ఒప్పందం) చేసుకోవాలి. ఆ ఒప్పందం కోసం 2021 సెప్టెంబరు 9న నాన్ జ్యూడీషియల్ స్టాంప్ పేపర్లు క్రమ సంఖ్య 1,186 నుంచి 1,235 వరకు 50 స్టాంప్ పేపర్లు కొనుగోలు చేశారు. వీటిని 2021 సెప్టెంబరు 9వ తేదీ తరువాతే వినియోగించాలి. అయితే 2020 సెప్టెంబరు 9న క్రమ సంఖ్య 1,203 నుంచి 1,210

స్టాంప్ పేపర్లలో తేదీ మార్చేసి..?

వరకు 8 నాన్ జ్యూడీషియల్ స్టాంప్స్ పేపర్లు వినియోగించి దాదాపు రూ.39 లక్షలకు కాంట్రాక్టరు కేపీ గిడ్డయ్య పేరిట అగ్రిమెంట్ చేశారు. ఇది ఎలా సాధ్యం..? దీనిపై అనుమానం వచ్చిన ఓ కాంట్రాక్టరు ఈ నాన్ జ్యూడీషియల్ స్టాంప్ పేపర్లు ఏ తేదీన జారీ చేశారని సమాచారం హక్కు చట్టం ద్వారా ఆదోని సబ్ రిజిస్ట్రార్‌ను కోరడంతో అసలు భాగోతం బయటకు వచ్చింది. అంటే.. 2021 సంవత్సరాన్ని 2020 సంవత్సరంగా దిద్ది ఏడాది ముందే కొన్నట్టు ట్యాంపరింగ్ చేశారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై పోలీస్ కేసు పెట్టాల్సిన అధికారులే విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ఎయిర్ వాల్వుల కొనుగోలు బాగోతం

ఎస్ఎస్ ట్యాంక్ నుంచి ఆయా గ్రామాలకు తాగునీటి సరఫరా చేసేందుకు పైపులైన్ ఏర్పాటు చేశారు. ఆస్పరి సీపీడబ్ల్యూఎస్ స్కీం పైపులైన్లకు 25-28 ఎయిర్ వాల్వులు ఏర్పాటు చేశారు. అప్పుడప్పుడు ఈ వాల్వులు మరమ్మతులు రావడం సహజం. ఒక్కో ఎయిర్ వాల్వు మరమ్మతులకు రూ.12-15 వేలకు మించి ఖర్చు కాదని కాంట్రాక్టర్లు, ఇంజనీర్లు కూడా అంటున్నారు. ఏకాలంలో మొత్తం ఎయిర్ వాల్వులు మరమ్మతులు రావని కూడా అంటున్నారు. ఒకవేళ గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టాలి. అదే జరిగితే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి.. ఆ తరువాత ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి, పరిపాలన, టెక్నికల్ అప్రూవల్ తీసుకొని కొత్తవి ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇందుకు విరుద్ధంగా ఈ స్కీం పరిధిలో రూ.12.21 లక్షలు వెచ్చించి 24 ఎయిర్ వాల్వులు కొత్తవి ఏర్పాటు చేయడం వెనుక అంతర్యమేమిటీ..? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 60 సీపీడబ్ల్యూఎస్ స్కీంలు ఉన్నాయి. వీటిలో పలు స్కీంలు 15-20 ఏళ్లుగా నిర్వహణలో ఉన్నాయి. ఎయిర్ వాల్వులు మరమ్మతులు చేశారే తప్పా.. ఏ స్కీంకు కూడా మొత్తం కొత్తవి ఏర్పాటు చేయలేదనే అంటున్నారు. గత ప్రభుత్వంలో వైసీపీ నాయకుడే కాంట్రాక్టరు కావడం, ఎమ్మెల్యే అండదండలు ఉండడంతో ఎవరు ప్రశ్నిస్తారులే అన్న ధీమాతో ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై ఎయిర్ వాల్వులు కొనుగోలుకు రూ.లక్షలు ప్రజాధనం ఇష్టారాజ్యంగా ఖర్చు చేశారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

అవుకు వాసికి అత్యున్నత పదవి

- ఒడిశా సీఈవోగా డాక్టర్ తిరుమలనాయక్
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానిక ప్రజలు



డాక్టర్ తిరుమలనాయక్
ఒడిశా రాష్ట్ర సీఈవో

అవుకు, జూలై 14 : నంద్యాల జిల్లా అవుకు గ్రామానికి చెందిన డాక్టర్ తిరుమలనాయక్ ఐఏఎస్ విజయగాథ యువతకు స్ఫూర్తిదాయకం. గిరిజన కుటుంబంలో జన్మించి అట్టడుగు స్థాయి నుంచి అంచలంచెలుగా ఎదిగి ఆదర్శంగా నిలిచారు. పశువైద్యాధికారిగా ఉద్యోగంలో చేరి పట్టుదలతో ఐఏఎస్ సాధించారు. ప్రస్తుతం ఒడిశా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో)గా నియమితులైన ఆయన జన్మనిచ్చిన అవుకు గ్రామానికి అరుదైన గౌరవాన్ని తెచ్చిపెట్టారు. తిరుమలనాయక్ తాత దాసన్న, అవ్వ సుబ్బమ్మ సీతమ్మ తండా నుంచి వచ్చి అవుకులో స్థిరపడ్డారు. వీరు ఆవులను కాసుకుంటూ వాటికి వచ్చే రోగాలకు నాటు వైద్యం చేస్తూ జీవనం సాగించేవారు. ఈ దంపతులకు లక్ష్మమ్మ కూతురు సంతానం. ఈమెను అప్పట్లోనే 10వ తరగతి వరకు చదివించారు. 1965లో కూతురు లక్ష్మమ్మను గడివేముల మండలం లక్ష్మయ్య కుంట తండా (ఎల్‌కే తండా)కు చెందిన రాముడితో వివాహం జరిపించారు. వీరికి సౌభాగ్య శిరోమణిబాయి, హరిసేవియా నాయక్, తిరుమలనాయక్ సంతానం. అయితే లక్ష్మమ్మ అవుకులో ఉంటూ పిల్లలను చదివించి పెద్ద చేసింది.

తిరుమలనాయక్ విద్యాభ్యాసం

తిరుమలనాయక్ 1980లో అవుకులో జన్మించాడు. 1 నుంచి 5 వరకు అవుకు ప్రాథమిక పాఠశాలలో, 6నుంచి ఇంటర్మీడియట్ వరకు ఎమ్మిగనూరు జవహర్ నవోదయ విద్యాలయం బనవాసి, అనంతరం ఐదేళ్ల కాలపరిమితిగల బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ కోర్సు తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో పూర్తి చేశాడు. 2004లో పశువైద్యాధికారిగా ఉద్యోగం సాధించి సంజామలలో పని చేశాడు. ఉద్యోగానికి లాంగ్ లీవ్ పెట్టి సివిల్స్‌కు ప్రిపేరయ్యాడు. రెండు సార్లు ఇంటర్వ్యూ వరకు వెళ్లి విఫలమయ్యాడు. మూడో సారి 2008లో జాతీయ స్థాయిలో 450 ర్యాంకు సాధించి ఒడిశా క్యాడర్ నుంచి ఐఏఎస్‌కు సెలక్ట్ అయ్యాడు. 2009లో ముస్సోరిలో ట్రైనింగ్ తీసుకొని 2010లో ఒడిశాలోని బాలాసోర్ జిల్లా ట్రైనీ కలెక్టర్‌గా విధుల్లో చేరాడు. 2011లో బంజీనగర్ జిల్లా సబ్ కలెక్టర్‌గా, 2012లో ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా, 2013లో కందమాల్ జిల్లా కలెక్టర్‌గా పని చేశారు. 2019లో లేబర్ కమిషనర్‌గా, 2023లో అడిషనల్ సీఈవోగా, 2024 జూలైలో రాష్ట్ర ఎన్నికల సీఈవోగా నియమితులయ్యారు.

పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దిన లక్ష్మమ్మ

తిరుమలనాయక్ తల్లి లక్ష్మమ్మ 1970లో ఏఎన్ఎంగా విధుల్లో చేరి పీహెచ్ఎన్‌గా పదోన్నతి పొంది 2007లో రిటైర్ అయ్యారు. తండ్రి రాముడు పిల్లల భవిష్యత్‌ను పట్టించుకోకపోయినా తల్లి లక్ష్మమ్మ మొక్కవోని ధైర్యంతో కష్టపడి ముగ్గురు పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దింది. మొదటి సంతానమైన కుమార్తె సౌభాగ్యశిరోమణిబాయి అనంతపురం జిల్లా ధర్మవరం ఎల్ఐసీ ఆఫీసులో ఏఏవోగా, రెండో కుమారుడు హరిసేవియా నాయక్ కడపలోని ఏపీ ఎస్పీడీసీఎల్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా, మూడో కుమారుడు తిరుమల నాయక్ ఐఏఎస్ సాధించి ఒడిశా రాష్ట్ర సీఈవోగా విధులు నిర్వహిస్తున్నారు.



ఒడిశా రాష్ట్ర సీఈవో తిరుమలనాయక్‌ను అభినందిస్తున్న అధికారులు (ఫైల్)

నేను సాధించిన విజయాలు అమ్మకే అంకితం

అమ్మ ఆనాడు బడిబాట పట్టించటంతోనే ఈరోజు మాకుటుంబ సభ్యులు ఈ స్థాయిలో ఉన్నారు. అమ్మ ప్రోత్సహించిన విధానం, నేర్పిన క్రమశిక్షణ, నేడు నన్ను ఈ స్థాయిలో నిలబెట్టింది. నేను ఇప్పటి వరకు సాధించిన విజయాలు అమ్మకే అంకితం. అట్టడుగు స్థాయిలో జీవనం సాగిస్తున్న గిరిజన పేద కుటుంబాలను ఆదుకునేందుకు నిత్యం శ్రమిస్తా. పేద విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడతా. ప్రజలకు సేవ చేయాలనే దృఢ సంకల్పంతోనే పని చేస్తున్నాను.

\- డాక్టర్ తిరుమల నాయక్, ఒడిశా రాష్ట్ర సీఈవో

నా పిల్లలకు చదువు దేవుడిచ్చిన వరం



నా పిల్లలకు దేవుడు ఇచ్చిన వరం చదువు. ఆర్థిక ఇబ్బందులు, ఒడుదుడుకులు ఎదురైనా నిలదొక్కుకున్నాను. పిల్లలు కూడా నా నమ్మకాన్ని వమ్ము చేయకుండా నా మదిలో మెదిలే కళలను నిజం చేశారు. ప్రజాసేవ చేయాలనే సంకల్పంతోనే నా కుమారుడు తిరుమల నాయక్‌ను ఐఏఎస్ అధికారిని చేశాను. నాకు ఇంతకన్నా ఏం కావాలి.

\- లక్ష్మమ్మ, రిటైర్డ్ పీహెచ్ఎన్, తిరుమల నాయక్ తల్లి

పర్యాటకరంగ అభివృద్ధికి పెద్ద పీట

పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్



మాట్లాడుతున్న రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్

నంద్యాల (నూనెపల్లె), జూలై 14: జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం నంద్యాలకు వచ్చిన మంత్రి దుర్గేష్ రాష్ట్ర మైనారిటీ సంక్షేమ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అనేక ప్రముఖ దేవాలయాలు ఉన్నాయని వాటన్నింటిపై సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసి పర్యాటక రంగంగా అభివృద్ధి చేస్తామన్నారు. దేవాలయాలతోపాటు ఆసియాలోనే రెండో అతి పొడవైన బెలుంగుహలు, సుందరమైన బిల్వ గుహలు, వాల్మీకి గుహలు, నంద్యాల జిల్లాలోనే ఉన్నాయని, ఈ ప్రాంతాల్లో రిసార్ట్ నిర్మిస్తామని వెల్లడించారు. పర్యాటకులను ఆకర్షించేలా ఆలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. శ్రీశైలంలో 79 గదులతో ఉన్న రెస్టారెంట్‌ను ఆధునికీకరించడంతోపాటు 42 కొత్త గదులను రూ.14.85 కోట్లతో నిర్మిస్తున్నామని తెలిపారు. మహానందిలో 31 గదులతో, అహోబిలంలో 8 గదులతో రెస్టారెంట్ సౌకర్యం ఉందన్నారు. అహోబిలంలో మరో 31 నూతన గదులు, 4 డార్మెటరీలను రూ.5 కోట్లతో నిర్మిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో అహోబిలం దేవాలయానికి నిధులను విడుదలయ్యాయని వెల్లడించారు. అటవీ, దేవాలయ, పర్యాటక ఇతరత్రా శాఖలను అనుసంధానం చేసి పర్యాటక రంగ అభివృద్ధికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. రాష్ట్ర మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ నంద్యాల ప్రొటెన్షియల్ జిల్లా అని శిల్పారామంతోపాటు టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు పర్యాటక మంత్రి చర్యలు తీసుకోవాలని సూచించానని చెప్పారు. నవ నందులు, నవ నరసింహాలు, శిలా సంపద, నల్లమల అటవీసంపద తదితర ప్రాముఖ్యత గల ప్రదేశాలు జిల్లాలో ఉన్నాయన్నారు. వీటన్నింటిని అభివృద్ధి చేయడంతోపాటు జిల్లాను టూరిజం రిసార్టుగా ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

సెలవులో కలెక్టర్



కర్నూలు(కలెక్టరేట్), జూలై 14: కలెక్టర్ పి.రంజిత్ బాషా సెలవుల్లో వెళ్లారు. ఈ నెల 17వ తేదీ వరకు వ్యక్తిగత సెలవుల్లో ఉండనున్నారు. ఈ మేరకు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌గా నారపురెడ్డి మౌర్య బాధ్యతలు నిర్వహించనున్నారు.

ఆక్రమించెయ్.. ఆపేదెవరు?



ఆదోని దివాకర్ రెడ్డి నగర్‌లో రస్తాలో ఇంటి నిర్మాణం చేసిన వైసీపీ నాయకుడు

- వంక రస్తాలో ఇళ్లు నిర్మించిన వైసీపీ నాయకులు
- ఇందిరమ్మ గృహాలకు వెళ్లే రహదారికి అడ్డంగా గుడిసె వేసిన వలంటీర్
- గత వైసీపీ ప్రభుత్వంలో ఏకంగా ఇంటి పట్టా మంజూరు
- మురుగు నీరు వెళ్లేందుకు దారి లేక కాలనీవాసుల అవస్థలు

ఆదోని (అగ్రికల్చర్), జూలై 14: ఖాళీ స్థలం కనిపిస్తే చాలు డబ్బు, పలుకుబడితో పాగా వేసేస్తున్నారు. వంక పోరంబోకు, డ్రైనేజీ, రహదారి, పంచాయతీ, ఆర్అండ్‌బీ.. ఇలా రూ.లక్షల విలువ చేసే ప్రభుత్వ భూములను ఆక్రమించేస్తున్నారు. ఆదోని పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో దివాకర్ రెడ్డి నగర్ వంక రస్తా జాగాను వదల్లేదు. వైసీపీకి చెందిన నాయకులు పర్వతాపురంలోని ఓ వలంటీర్ ఏకంగా రోడ్డును ఆక్రమించుకొని గుడిసె నిర్మించుకున్నాడు. దివాకర్ రెడ్డి నగర్‌లో గతంలో టీడీపీ ప్రభుత్వం ఇల్లు లేని పేదలకు అక్కడ పట్టాలు మంజూరు చేసి ఇల్లు నిర్మించింది. బస్టాండ్ నుంచి దివాకర్ రెడ్డి నగర్‌లో నుంచి ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు తమ ఆర్టీసీ కాలనీలోకి వెళ్లేందుకు 36 అడుగుల రాస్తాను వదిలారు. రాస్తా ఖాళీ స్థలం ఉందని అదునుగా భావించి తమ వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండడంతో ఏకంగా రెవెన్యూ అధికారుల చేతనే పట్టా మంజూరు చేసుకున్నారు. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకుందామని భావించి రస్తా స్థలంలో ఇల్లే నిర్మించుకున్నారు. దీనిపై చుట్టపక్కల వాళ్లు అభ్యంతరం తెలిపినా టౌన్ ప్లానింగ్ అధికారులు వారికే వత్తాసు పలికేశారు.

రస్తా చూపాలంటూ..

దివాకర్‌రెడ్డి కాలనీలో 150 పైగా నిరుపేదల నిర్వహిస్తున్నారు. కాలనీకి పక్కనే పెద్ద వంక ఉంది. టీడీపీ ప్రభుత్వం గతంలో అక్కడ ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి లేఅవుట్ వేసి పట్టాలు మంజూరు చేసింది. రహదారులు, కాలువలు, నీటి ట్యాంకర్ వెళ్లడానికి ఖాళీ స్థలం వదిలారు. దివాకర్ రెడ్డి నగర్‌లోని సర్వే నెంబర్ 367/ఏలో 219 పక్కన 35 అడుగుల రహదారిని వదిలారు. పట్టాదారు పాస్ పుస్తకంలో రస్తా, నీటి ట్యాంకు అని స్పష్టంగా ఉన్నప్పటికీ వైసీపీకి చెందిన రమేష్ తన బంధువు నారాయణ పేరు మీద పట్టా పుట్టించుకున్నాడు. ఇంటి నిర్మాణానికి అడ్డు చెప్పిన కాలనీవాసులపై బెదిరింపులకు పాల్పడ్డాడు. కాలనీవాసులు అటువైపు వెళ్లేందుకు రహదారి లేక ఇళ్లలోని మురుగు నీరు కాలువలోకి వెళ్లేందుకు దారి లేక ఇళ్ల మధ్యనే నిలువ ఉంటుండడంతో రహదారి చూపించాలని పట్టుబట్టారు. అవేమీ పట్టించుకోకుండా ఏకంగా పురపాలక అధికారులు వేసిన బోరును ఆక్రమించుకొని ఇంటిని నిర్మించారు. దీనిపై అప్పటి ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డికి ఫిర్యాదు చేసినా ఆయనకే వత్తాసు పలికాడని కాలనీవాసులు వాపోయారు. ప్రస్తుతం అక్కడ ఆర్టీసీ కొత్త బస్టాండ్ ఉండడంతో స్థలం రూ.లక్షలు పలుకుతుండడంతో కబ్జాదారుల కన్ను పడింది. పట్టణ టౌన్ ప్లానింగ్ అధికారులు సైతం ఇంటి నిర్మాణానికి ఏ విధంగా అనుమతులు ఇచ్చారని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై విచారణ చేపట్టి రహదారిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



దివాకర్ రెడ్డి నగర్‌లో రహదారిని ఆక్రమించుకోవడంతో ఇళ్ల మధ్యలోనే నిలిచిన మురుగు నీరు

రహదారినే ఆక్రమించుకున్న వలంటీర్

పట్టణ శివారు ప్రాంతమైన పర్వతాపురంలో గత ప్రభుత్వంలో పని చేసిన వలంటీర్ ఇందిరమ్మ ఇళ్లకు వెళ్లే 40 అడుగుల రహదారినే ఆక్రమించుకున్నాడు. గుడిసెలు వేసుకున్నాడు. ఇందిరమ్మ గృహాల కాలనీవాసులు అభ్యంతరం తెలిపితే అధికార పార్టీ వలంటీర్‌నంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో కాలనీవాసులు పురపాలక శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పూర్తి ఆధారాలతో వారికి సమర్పించి వెంటనే రహదారిలో నిర్మించిన గుడిసె తొలగించాలని కోరుతున్నారు.



ఆదోని పర్వతాపురం గ్రామంలో ఇందిరమ్మ గృహాలకు వెళ్లే రహదారిని ఆక్రమించుకొని వలంటీర్ వేసుకున్న గెడిసె

హోదా కోసం కేంద్రాన్ని నిలదీయండి

మాజీ మంత్రి సాకే శైలజానాథ్



సమావేశంలో మాట్లాడుతున్న శైలజానాథ్

కర్నూలు(అర్బన్), జూలై 14: ప్రత్యేక హోదా కోసం కేంద్ర ప్రభుత్వాన్ని సీఎం చంద్రబాబుకు నిలదీయాలని సీఎం మాజీ మంత్రి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు సాకే శైలజానాథ్ అన్నారు. ఆదివారం నగరంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ బాబురావుతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర పునర్విభజన జరిగి పది సంవత్సరాలైందని, జగన్, చంద్రబాబులు సీఎంలుగా రాష్ట్రానికి, ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. సీఎ. చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కర్నూలు జిల్లా అభివృద్ధి గురించి ఆలోచించాలని అన్నారు. గుండ్రేవుల తుంగభద్రడ్యామ్‌ల నిర్మాణాలు, హైకోర్టు బెంచ్, స్టీల్ ఫ్యాక్టరీ, రైల్వేకోచ్ ఫ్యాక్టరీ ఎక్కడ అని ప్రశ్నించారు. మోదీకి సాష్టాంగ నమస్కారాలు పెట్టే వారు రాష్ట్ర ప్రజల గురించి ఎక్కడ ఆలోచిస్తారని ఎద్దేవా చేశారు. ప్రత్యేక హోదా కోసం ఎంపీలు కేంద్రానికి మద్దతు ఉపసంహరించుకుంటే ఎందుకు కేంద్ర ప్రభుత్వం దిగిరాదన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పరిగెల మురళీకృష్ణ, అశోకరత్నం, సయ్యద్ నవీద్, లాజరస్, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

చిరుతపులిని బంధించేందుకు చర్యలు

- రంగంలోకి దిగిన ప్రత్యేక బృందాలు
- అడ్డంకిగా మారిన ఎడతెరపిలేని వర్షం

మహానంది, జూలై 14: చిరుతపులిని బంధించేందుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. ఇప్పటికే నల్లమల తీరం వెంబడి గతంలో చిరుతపులి సంచరించిన ప్రదేశాల్లో అత్యాధునిక సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. యాంటీ కోచింగ్ టీంకు చెందిన నలుగురు నిరంతరం మహానంది పరిసరాల్లో గస్తీ తిరుగుతూ చిరుతపులి పాదముద్రలను సేకరిస్తున్నారు. వీరితోపాటు ఎన్ఎస్‌టీఆర్ (నాగార్జునసాగర్ టైగర్ రిజర్వు ఫారెస్ట్) బృందానికి చెందిన పది మంది చిరుతపులి కదలికలపై ఇక్కడి పరిస్థితులను తెలుసుకుంటూ ఎప్పటికప్పుడు ఉన్నత స్థాయి అధికారులకు చేరవేస్తున్నారు. శనివారం అటవీశాఖ పీసీసీఎఫ్, వైల్డ్ లైఫ్ వార్డెన్ అజయ్‌కుమార్ నాయక్ మహానంది గోశాలను సందర్శించి ఇక్కడి తాజా పరిస్థితులను సిబ్బందితోపాటు దేవదాయశాఖ అధికారుల ద్వారా తెలుసుకున్నారు. ఆయన రాకతో చిరుతపులిని బంధించే చర్యలు వేగవంతమయ్యాయి. అయితే గత రెండు రోజులుగా మహానంది పరిసరాల్లో ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుండటంతో చిరుతపులి కదలికలను కనుక్కోవడం సిబ్బందికి కష్టంగా మారింది. ఏదేమైనా త్వరలోనే ఎన్ఎస్‌టీఆర్ బృందానికి చెందిన సభ్యులు చిరుతపులిని పట్టుకుంటారని అటవీశాఖ సిబ్బంది తెలిపారు.

నేడు సెంటినరీ హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

నంద్యాల (కల్చరల్), జూలై 14: నంద్యాల కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార విధానం ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు కలెక్టర్ జి.రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే ప్రక్రియను పబ్లిక్ గ్రీవియన్స్ రెడ్రస్సల్ సిస్టం (పిజిఆర్ఎస్) ద్వారా చేపట్టనున్నట్లు తెలిపారు. ఉదయం 9.30గంటలకు జిల్లా అధికారులందరూ హాజరు కావాలని అన్నారు. అలాగే జిల్లా కేంద్రంతోపాటు మండల, నియోజ కవర్గ, డివిజన్ స్థాయిలో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మల్లన్న సన్నిధిలో ఏపీ హైకోర్టు జడ్జి



ఆలయ ప్రాంగణంలో జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప

శ్రీశైలం, జూలై 14: శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను ఆదివారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్ద చేరుకున్న జడ్జి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాపకు ఆలయ కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు, అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప స్వామివారికి అభిషేకం నిర్వహించి భ్రమరాంబికా దేవి అమ్మవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో జడ్జి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాపకు వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు. తరువాత జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాపకు ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు.

పోలీస్‌లకు సవాల్‌గా వాసంతి అదృశ్యం కేసు

- ఎనిమిది రోజులైనా లభించని బాలిక ఆచూకీ
- తల్లిదండ్రులను విచారించిన పోలీసులు



ముచ్చుమర్రిలో పోలీస్ డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు

నందికొట్కూరు/పగిడ్యాల, జూలై 14: వాసంతి అదృశ్యం కేసు పోలీసులకు సవాల్‌గా మారింది. ఎనిమిది రోజులైనా బాలిక ఆచూకీ దొరకలేదు. వాసంతి బంధువులు, తల్లిదండ్రులను ఆదివారం తెల్లవారుజామున పోలీస్‌లు నందికొట్కూరు, జూపాడుబంగ్లా పోలీస్ స్టేషన్లకు తీసుకొనిపోయి విచారించారు. బాలిక తల్లి సుజాత, తండ్రి మద్దిలేటిని వేరువేరుగా విచారించారు. బాలిక ఎన్ని గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వచ్చింది.. తల్లిదండ్రులు ఎక్కడెక్కడ వెతికారు.. వెంట ఎవరిని తీసుకుపోయారు.. వంటి వివరాలు అడిగినట్టు తెలిసింది. బంధువుల్లో ఎవరైనా క్షుద్రపూజలు చేసే వారు ఉన్నారా అని అడిగినట్టు సమాచారం. అలాగే బాలిక ఇంటి పరిసర ప్రాంతాలలో ఉంటే ఓ మహిళ గురించి ఆరా తీసినట్లు తెలిసింది. బాలిక తల్లిదండ్రులకు ఏఏ ఊరిలో బంధువులు ఉన్నారో వారి ఇళ్ల వద్ద సంబంధింత పోలీస్‌స్టేషన్ల సిబ్బందితో విచారించినట్లు సమాచారం.

మరోసారి డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు

పగిడ్యాల: మండల పరిధిలోని ముచ్చుమర్రి గ్రామానికి చెందిన వాసంతి ఆచూకీ కోసం ఆదివారం మరోసారి పోలీస్‌లో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. బాలిక ఇంటి నుంచి డాగ్ ప్రధాన రోడ్డు వెంట వెళ్లి పాత ముచ్చుమర్రిలోని పార్కులో అటు ఇటు తిరిగింది. అక్కడి నుంచి ఎత్తిపోతల పథకం వద్దకు చేరుకునే సరికి వర్షం కురవడంతో పోలీస్‌లు వెనుదిరిగారు. వాసంతి హత్యకు సంబంధించిన సంఘటనపై ఆదివారం సీఐ నాగరాజరావు ఆటో డ్రైవర్లను విచారంచారు. ఆటో డ్రైవర్లను ఒక్కొక్కరిని పిలిచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పార్కు సమీపంలోని బస్టాండ్ ఆవరణంలో లటోలు నిలపడం వల్ల బాలిక ఎవరికైనా కనిపించిందా.. అనుమానాస్పందగా ఎవరైనా ఇక్కడ సంచరించారా అనే విషయాలపై ఆరా తీశారు. గ్రామంలో ఎనిమిది రోజులుగా బాలిక ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామని, ఎవరైనా సమాచారం తెలిస్తే పోలీస్‌లకు తెలియజేయాలని కోరారు.

విచారణలో పాత అధికారులు

వాసంతి కేసును విచారించేందుకు నందికొట్కూరు, ముచ్చుమర్రి పోలీసుస్టేషన్‌లలో గతంలో పని చేసిన సీఐ, ఎస్ఐలను ప్రభుత్వం రంగంలోకి దింపింది. నందికొట్కూరు సీఐగా పని చేసిన నాగరాజరావు, ముచ్చుమర్రిలో ఎస్ఐగా పని చేసిన శ్రీనివాసులులతోపాటు రెండు ఉభయ జిల్లాల్లోని సీఐలు, ఎస్ఐలను విచారణ అధికారులుగా నియమించారు. ఆదివారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో డాగ్ స్క్వాడ్‌తో పరిశీలించారు. వాసంతి ఇంటి నుంచి బయలుదేరిన డాగ్ పాత ముచ్చుమర్రి గ్రామంలోని పార్కులో తిరిగి అక్కడి నుంచి నెహ్రూనగర్ రోడ్డు మీదుగా ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం వద్ద వరకు వెళ్లినట్లు తెలుస్తోంది.

ఆఖరి చూపైనా చూసుకుంటాం

- మా పాపను అప్పగించండి
- రోధిస్తున్న వాసంతి తల్లిదండ్రులు

నందికొట్కూరు: ఆఖరి చూపైనా చూసుకుంటాం తమ బిడ్డను చూపించాలంటూ వాసంతి తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. ఎనిమిది రోజుల క్రితం కనిపించకుండా పోయిన వాసంతి తల్లిదండ్రులు మద్దిలేటి, సుజాతమ్మలు గుండెలు పగిలేలా రోధిస్తున్నారు. ప్రతి రోజు పాప చేసిన అల్లరి, ముచ్చట్లను జ్ఞాపకం చేసుకుంటూ బోరున విలపిస్తున్నారు. ఇప్పటికైనా పాప ప్రాణాలతో ఉంటే తీసుకు రావాలని, జరగరానిదేదైనా జరిగి ఉంటే ఆఖరి చూపైనా పాపను చూసుకుంటామని అంటున్నారు.



వాసంతి తల్లిదండ్రులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి



ముచ్చుమర్రిలో ఆటో డ్రైవర్లను విచారిస్తున్న సీఐ నాగరాజరావు

బాలుడి కిడ్నాప్

కర్నూలు, జూలై 14: మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్దూరు నగర్ సమీపంలో అబ్దుల్ రెహిమాన్ అనే బాలుడు కిడ్నాప్‌కు గురయ్యాడు. పోలీసుల వివరాల మేరకు.. నంద్యాలకు చెందిన సుంకన్న, షేక్ అమీనాలు ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ముగ్గురు కొడుకులు, కూతురు సంతానం. బతుకుదెరువు కోసం వీరిద్దరు పది రోజుల క్రితం కర్నూలు వచ్చారు. సమీపంలో చెత్తకాగితాలు వేరుకుంటూ జీవిస్తున్నారు. శనివారం రాత్రి వర్షం పడుతుండటంతో మద్దూరు నగర్‌లో ఉన్న హనీఫ్ ట్రేడర్స్ షాపు ముందు భార్యా పిల్లలతో కలిసి పడుకున్నారు. తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో చిన్న కుమారుడు అబ్దుల్ రెహిమాన్ కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తే ఒక ఆటోలో వచ్చిన కొంత మంది వ్యక్తులు ఆ చిన్న బాలుడిని కిడ్నాప్ చేసినట్లు గుర్తించారు. ఆటో నెంబరు ఆధారంగా నిందితుల కోసం గాలిస్తున్నారు.

శ్రీశైలంలో భక్తుల రద్దీ

శ్రీశైలం, జూలై 14: శ్రీశైలం మహాక్షేత్రానికి ఆదివారం వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆదివారం వేకువజాము నుంచే భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. కల్యాణ కట్టనందు అధిక సంఖ్యలో భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించారు. పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు అధికారులు అల్పాహారం, నిరంతరం తాగునీరు అందజేశారు. భక్తుల రద్దీతో క్షేత్ర ప్రధాన వీధులు రద్దీగా దర్శనమిచ్చాయి. భక్తుల సౌకర్యార్థం నిత్యాన్నదాన భవనంలో అన్నప్రసాద వితరణను చేశారు. క్షేత్రపరిధిలోని సత్రసముదాయాలు రద్దీగా కనిపించాయి.



క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు



ఘనంగా సుదర్శన జయంతి వేడుకలు

ఆళ్లగడ్డ, జూలై 14: అహోబిలం శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఆదివారం సుదర్శన జయంతి వేడుకలను పీఠాధిపతి రంగనాథయతీంద్ర మహాదేశికన్ సమక్షంలో వేదపండితులు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఉత్సవమూర్తులైన ప్రహ్లాదవరదస్వామీ, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు విశేషపూజలు నిర్వహించారు అనంతరం సుదర్శన జయంతి హోమాన్ని భక్తుల సమక్షంలో చేపట్టారు. కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

నేడు స్వాతి వేడుకలు

అహోబిలం లక్ష్మీనరసింహస్వామి జన్మనక్షత్రమైన స్వాతి వేడుకలను సోమవారం నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకులు వేణుగోపాలన్ ఆదివారం చెప్పారు. ఈ వేడుకల్లో భాగంగా సుదర్శన హోమాన్ని నిర్వహిస్తామన్నారు.

కాటసాని నుంచి ప్రాణ హాని

రక్షణ కల్పించాలని ఎస్పీలకు మల్లెల రాజశేఖర్ విజ్ఞప్తి



సమావేశంలో మాట్లాడుతున్న నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు

కర్నూలు(అర్బన్), జూలై 14: వైసీపీ మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఆయన కొడుకు కాటసాని శివనరసింహారెడ్డి, ఓర్వకల్లు మండలానికి చెందిన గుర్రాల చెన్నారెడ్డి, జీకే వెంగన్న, గోపాల్‌రెడ్డిల నుంచి తనకు ప్రాణహాని ఉందని నంద్యాల పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌గౌడ్ అన్నారు. ఆదివారం కర్నూలు నగరంలోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వైసీపీలో కొనసాగిని లోటర్ బాషాతో కలిసి తన హత్యకు పైన పేర్కొన్న వారంతా పన్నాగం పన్నారని తెలిపారు. బాధ్యులను విచారించి తనకు న్యాయం చేయాలని రెండు జిల్లాల ఎస్పీలను కోరారు. జిల్లాలో లోకేశ్ యువగళం పాదయాత్ర సందర్భంగా ఆయనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే కాటసాని నాలుక కోస్తానని హెచ్చరించానని, గౌరు చరిత గెలుపునకు కృషి చేశానని దీంతో తనపై కక్ష కట్టారని అన్నారు. తన అడ్డు తొలగించుకునేందుకు హత్యకు వ్యూహం పన్నుతున్నారని ఆరోపించారు. జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడికే ఇలాంటి పరిస్థితి ఉంటే సామాన్య కార్యకర్తల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. వెంటనే పోలీసు యంత్రాంగం స్పందించాలని, లేనిపక్షంలో డీజీపీ, రాష్ట్ర హోం మంత్రిని కలిసి తనకు రక్షణ కల్పించాలని కోరతానన్నారు. సమావేశంలో ఓర్వకల్లు మండలం కాపు సంఘం నాయకులు కేవీ మధు, తెలుగుదేశం పార్టీ నాయకులు చదువుల సుధాకర్‌రెడ్డి, మహబూబ్ బాషా, వడ్డె నారాయణ తదితరు పాల్గొన్నారు.

కర్నూలు

కర్నూలు ● కోడుమూరు ● పాణ్యం

భక్తిభావం అలవర్చుకోవాలి: ఎమ్మెల్యే



చర్చిలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

ఓర్వకల్లు, జూలై 14: ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని అలవర్చుకోవాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. ఆదివారం మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో తెలుగు బాప్టిస్టు చర్చి ప్రతిష్ఠ మహోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై చర్చిని ప్రారంభించారు. అంతకుముందు ఎమ్మెల్యేకు గ్రామ టీడీపీ నాయకులు, దళితులు పూల మాలలు, భాజాభజంత్రీలతో ఘన స్వాగతం పలికారు. నూతన చర్చి నిర్మాణానికి సహకరించిన దాతలను ఎమ్మెల్యే అభినందించారు. పాస్టర్ మద్దిలేటి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు పార్వతమ్మ, వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లి నాగిరెడ్డి, నాయకులు నాగేశ్వరరావు, రాజు, రామాంజనేయులు, శ్రీను పాల్గొన్నారు.

పుసులూరు దర్గాలో గౌరు చరిత పూజలు

కల్లూరు: మొహర్రం పండుగ మతసామరస్యానికి ప్రతీక అని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. ఆదివారం కల్లూరు మండలం పుసులూరు గ్రామంలోని పెద్దస్వామిద దర్గా చావిడిలోని పీర్లకు ఆమె పూజలు నిర్వహించారు. నంద్యాల పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు, కె.పార్వతమ్మ, టీడీపీ మండల అధ్యక్షుడు డి.రామాంజనేయులు, మండల టీడీపీ నాయకుడు పుసులూరు ప్రభాకర్‌రెడ్డి, వాకిటి మాదేష్ హాజరయ్యారు. ఈసందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ మొహర్రం వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో సల్కాపురం దేవేంద్రారెడ్డి, ఖాజా మియ, మౌలాలి పాల్గొన్నారు.

ఫోర్స్ మోటార్స్ గూర్ఖా వాహనం విడుదల



వాహనాన్ని ప్రారంభిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, జూలై 14: ఫోర్స్ మోటార్స్ నూతన గూర్ఖా వాహనాన్ని విడుదల చేశారు. ఆదివారం కల్లూరు మండలం లక్ష్మీపురంలో శ్రీలక్ష్మీ వెంకటేశ్వర మోటార్స్ అధినేత వై.వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై నూతన గూర్ఖా వాహనాన్ని ప్రాంభించారు. నంద్యాల పార్లమెంట్ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, నంద్యాల పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ, కర్నూలు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, ఉలిందకొండ టీడీపీ నాయకులు ఈవీ రమణ, కేవీ సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి మాట్లాడుతూ ఫోర్స్ మోటార్స్ గూర్ఖా వాహనాన్ని ప్రత్యేక డిజైన్‌తో తయారు చేశారన్నారు. వాహనదారులకు అనుకూలమైన చాలా ప్రత్యేకతలతో గూర్ఖా వాహనం 3, 5 డోర్లతో అందు బాటులో ఉందన్నారు. షోరూం అధినేత వై.వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఫోర్స్ మోటార్స్ గూర్ఖా వాహనం సిటింగ్ సైజు పెద్దగా ఉందన్నారు. కార్యక్ర మంలో కార్పొరేటర్ క్రైప పద్మలత, టీడీపీ మండల అధ్యక్షుడు డి.రామాం జనేయులు, తడకనపల్లె సర్పంచ్ సహారాబీ, కుర్వ ధనుంజయ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో వైద్య శిబిరం

ఓర్వకల్లు, జూలై 14: మండలంలోని కాల్వబుగ్గ గురుకుల పాఠశాలలో ఆదివారం ఆకర్ష్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందు లు పంపిణీ చేశారు. శిబిరంలో వైద్యులు జనార్దన్ రెడ్డి, మహేశ్వరరెడ్డి, తిరుపతి, శ్రీనివాసరావు, పవన్, శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ ప్రసాద్‌రావు, ల్యాబ్ టెక్నికల్స్ వసంత్, రాజ్‌కుమార్, మనోహర్, స్టాఫ్ నర్సు జయమ్మ, ముర్తుజా వలి, ఆకర్ష్ సభ్యులు నాగ సుబ్బరాయుడు, వెంకటనారాయణ, విజయకుమార్ రెడ్డి, కమల్‌సాహెబ్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కర్నూలు(స్పోర్ట్స్), జూలై 14: నగరంలో ఏపీ పీఈటీ అండ్ ఎస్‌పీ భవన్‌లో ఆదివారం జిల్లా పీఈటీ అండ్ ఎస్ పీ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా జోసెఫ్ లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శిగా చందు నాయక్, కోశాధికారిగా శ్రీనివాసులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రాష్ట్ర సంఘం సభ్యులు ఖలీల్ మహ్మద్, పాండు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కిషోర్, జిల్లా ప్రచార కార్యదర్శి అబ్దుల్ మాలిక్, జిల్లా స్కూల్ గేమ్స్ అసిస్టెంట్ కార్యదర్శి శేఖర్, వివిధ జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు నరసింహరాజు, రామన్న, రంగస్వామి, హనుమాన్, కడ్డీరప్ప నాయక్, విష్ణువర్ధన్ రెడ్డి, పరమేష్, సుబ్రహ్మణ్యం, వెంకట్రాముడు, శేషాద్రి, హుకుంసింగ్, గోపాల్, అస్లాం పాల్గొన్నారు.

మొహర్రానికి ప్రత్యేక బస్సు

సి.బెళగల్, జూలై 14: మండలంలోని గొల్లలదొడ్డిలో మొహర్రం పండుగను పురస్కరిచుకుని ఆర్టీసీ ప్రత్యేక బస్సు నడుపుతోంది. గ్రామస్థులు తిరుమల్‌రెడ్డి, సోమేశ్వరరెడ్డి, అనుమంతు, దూద్‌వలిలు ఆర్టీసీ అధికారులను కలిసి ప్రత్యేక బస్సు వేయాలని కోరారు. ఈ మేరకు కర్నూలు రెండో డిపో నుంచి వారం రోజుల పాటు ప్రత్యేక బస్సు నడుపుతామని ఆర్టీసీ అధికారులు తెలిపారని గ్రామస్థులు పేర్కొన్నారు.

అధికారులు హాజరు కావాలి

సి.బెళగల్, జూలై 14: ప్రజాఫిర్యాదుల సేకరణ కార్యక్రమానికి అధికారుల హాజరు కావాలని తహసీల్దార్ అనుపమ తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల సేకరణ కార్యక్రమానికి హాజరు కాని అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

పచ్చదనం పెంపునకు 20 వేల మొక్కలు

కర్నూలు(న్యూసిటీ), జూలై 14: నగరంలో 20 వేల మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిషనర్ ఎ.భార్గవతేజ తెలిపారు. ఆదివారం సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. తొలి విడతగా ఐదు వేల మొక్కలను నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. రహదారులు, పార్కులు, విశాలమైన ప్రభుత్వ స్థలాల్లో 20 వేలకు పైగా మొక్కలు నాటేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని ఆయన తెలిపారు.

అక్రమ కనెక్షన్లు

» నగరంలో నాలుగు వేలకు పైగా అనుమతి లేని కొళాయిలు

» మామూళ్ల మత్తులో సిబ్బంది

కర్నూలు(న్యూసిటీ), జూలై 14: నగర పాలక సంస్థ పరిధిలో అక్రమ కొళాయి కనెక్షన్లు పెరిగిపోతున్నాయి. అయినా ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కొందరు సిబ్బంది అందినకాడికి దండుకుంటూ అక్రమ కనెక్షన్లు ఇస్తూ సంస్థ ఆదాయానికి గండి కొడుతున్నారు. నగర పరిధిలో 7 లక్షల మందికి పైగా ప్రజలు నివసిస్తున్నారు. కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ప్రజలకు మునగాలపాడు సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు నుంచి వచ్చే నీటిని అశోక్‌నగర్ పంప్ హౌస్‌కు తరలించి శుద్ధి చేసి సరఫరా చేస్తున్నారు. పాణ్యం, కోడుమూరు నియోజకవర్గ ప్రజలకు మునగాలపాడు నూతనంగా ఏర్పాటు చేసి 15 ఎంఎల్‌డీ ప్లాంట్ నుంచి నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే కొన్ని శివారు కాలనీలతోపాటు నగరంలోని ప్రధాన కాలనీల్లో నీరు సరిగ్గా రావడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయి. గతంలో మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ గడప గడప కార్యక్రమంలో చాలా వార్డుల్లో ప్రజలు తమకు తాగునీటి సమస్య ఉన్నట్లు ఫిర్యాదు కూడా చేశారు. తాగునీటి సమస్యను అధిగమించేందుకు ఇటీవల మంత్రి టీజీ భరత్ రెండు సార్లు ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇళ్లు, పరిశ్రమలకు కొళాయి కనెక్షన్ల మంజూరులో సరైన అవగాహన లేకపోవడంతో నీటి సమస్య తీవ్రమైందనే వాదనలు వినిపిస్తున్నాయి. దీనినే ఆసరాగా చేసుకుని కొందరు అధికారుల అండదండలతో ఇష్టానుసారంగా అక్రమ కొళాయి కనెక్షన్లు ఇస్తూ జేబులు నింపుకుంటున్నారు. అదేవిధంగా ఓ ఉన్నతాధికారికి సిబ్బంది ప్రతి నెలా మామూళ్లు ఇస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

● **ఇక్కడే అధికం..** నగర పరిధిలోని స్టాంటాన్‌పురం, సంతోష్‌నగర్, జొహరాపురం, ప్రకాష్‌నగర్, ఎన్‌ఆర్‌పేట, నంద్యాల చెక్‌పోస్టు, వీకర్‌సెక్షన్ కాలనీ, తుంగభద్ర నదీతీరం వెంట, మేయర్ వార్డులోని పాలు కాలనీల్లో అక్రమ కొళాయి కనెక్షన్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అయితే ఇటీవల నూతన వెంచర్లకు కూడా అక్రమ కొళాయి కనెక్షన్లు ఇచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. సుమారు 4 వేలకు పైగా అక్రమ కనెక్షన్లు ఉన్నట్లు గుర్తించినా వాటికి ఇప్పటి వరకు నోటీసులు ఇవ్వకపోవడం కొసమెరుపు.

● **అధికారి కనుసన్నల్లో..** అక్రమ కొళాయి కనెక్షను అన్ని కూడా కార్యాలయంలో పని చేస్తున్న ఓ అధికారి కనుసన్నల్లో జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఆ అధికారి వద్దకు ఏ పనికి వచ్చినా ఆయన ఇంట్లో డ్రైఫ్రూట్స్ ఇచ్చిన తరువాతనే పని ముగిస్తాడు. దీంతో ఆ అధికారికి డ్రైఫ్రూట్స్ అధికారి అనే నామకరణం చేశారు. ప్రతి నెల సిబ్బంది మామూళ్లతోపాటు డ్రైఫ్రూట్స్ కూడా తీసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలా వస్తుండటంతో ఆయన చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అయితే గతంలో మేయర్ వార్డులో అక్రమ కొళాయి కనెక్షన్లు ఉన్నట్లు గుర్తించి తొలగించారు. ఈవిషయంపై డీఈ, ఏఈ, ట్యాప్ ఇన్స్‌పెక్టర్లకు వివరణ ఇవ్వాలని మెమో జారీ చేశారు. మేయర్ వార్డులోనే అక్రమ కొళాయి కనెక్షన్లు ఉంటే శివారు కాలనీల్లో ఇంకెన్ని ఉంటాయో లెక్కలు తేలాల్సిందే.

● **అక్రమాలకు తెర..** నగర పరిధిలో ఒక ఇంటికి కొళాయి కనెక్షన్ అత్యవసరం కింద మంజూరు చేయాలంటే రూ.10,500 చలానా కట్టాలి. ఇదే కనెక్షన్ నిర్ణీత సమయంలో ఇవ్వాలంటే రూ.6,510 కట్టాలి. పరిశ్రమలకు రూ.20,500 డిపాజిట్ చేయాలి. అయితే కిందిస్థాయి సిబ్బంది కొందరు ఉన్నతాధికారుల అండదండలతో కొళాయి కనెక్షన్ కోసం ప్రజలు చెల్లించే నగదులో కొంత సొమ్మును తీసుకుని అక్రమంగా కొళాయి కనెక్షన్లు ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఇదంతా ఇంజనీరింగ్ సెక్షన్‌లో అధికారి చేతుల్లోనే జరుగుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.



నగర పాలక సంస్థ కార్యాలయం

● **సంస్థ ఆదాయానికి గండి..** నగరంలోని పలు విభాగాల ద్వారా నగర పాలక సంస్థకు నీటి పన్ను నుంచి ప్రతి సంవత్సరం రూ.10 కోట్ల వరకు వసూలవుతోంది. అయితే గత నాలుగేళ్లుగా రూ.3 నుంచి రూ.4 కోట్ల వరకు మాత్రమే వసూలు అవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రతి సంవత్సరం సుమారు రూ.6 కోట్లు వరకు బకాయిలు ఉంటున్నాయి. కొంత మంది లబ్ధిదారులు సిబ్బందికి కొంత సొమ్ము ఇచ్చి తప్పించుకుంటున్నారు. అలాగే కొందరు సిబ్బంది ఏకంగా లబ్ధిదారుల నుంచి నీటి పన్ను వసూలు చేసుకుని సొంతానికి వాడుకుంటున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

చర్యలు తీసుకుంటాం

నగర పరిధిలో అక్రమ కొళాయి కనెక్షన్లు ఉంటే తనిఖీ చేసి చర్యలు తీసుకుంటాం. అక్రమ కనెక్షన్లు తొలగించడానికి ప్రత్యేక సిబ్బందిని నియమిస్తాం.

- శేషసాయి, ఈఈ, నగర పాలక సంస్థ, కర్నూలు

బొల్లెద్దుల రామకృష్ణ మృతి బాధాకరం: మంత్రి టీజీ భరత్



రామకృష్ణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి టీజీ భరత్, రామకృష్ణ భౌతిక కాయంపై పూలమాల వేస్తున్న ఎంపీ

కర్నూలు(అర్బన్), జూలై 14: బొల్లెద్దుల రామకృష్ణ మృతి బాధాకరమని రాష్ట్ర మంత్రి టీజీ భరత్ అన్నారు. ఆదివారం నగరంలోని ఎస్ఎస్ నగర్‌లోని ఆయన ఇంటి వద్ద ఉంచిన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. టీడీపీ సీనియర్ నాయకుడు బొల్లెద్దుల రామకృష్ణ గుండెపోటుతో మృతి చెందడం పార్టీకి తీరని లోటన్నారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను మంత్రి ఓదార్చారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసు కున్నారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

కీలక నాయకుడిని టీడీపీ కోల్పోయింది: ఎంపీ

తెలుగుదేశం పార్టీ కీలక నాయకుడు బొల్లెద్దుల రామకృష్ణను కోల్పోయిందని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. ఆదివారం నగరంలోని సాయిబాబా సంజీవయ్య నగర్‌లోని బొల్లెద్దుల రామకృష్ణ భౌతిక కాయంపై పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ బొల్లెద్దుల రామకృష్ణ మృతి టీడీపీకి తీరని లోటని, ఆయన పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారని అన్నారు.

ప్రభాకర్‌రెడ్డి మృతి టీడీపీకి తీరని లోటు



నివాళులర్పిస్తున్న గౌరు వెంకటరెడ్డి

ఓర్వకల్లు, జూలై 14: మండలంలోని కన్నమడకల గ్రామ సీనియర్ టీడీపీ నాయకుడు అన్నం ప్రభాకర్ రెడ్డి (85) మృతి పార్టీకి తీరని లోటని పార్టీ నందికొట్కూరు ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. ఆదివారం మండలంలోని కన్నమడకల గ్రామంలో ప్రభాకర్‌రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి కుటుంబ సభ్యులకు తమ సానుభూతి తెలిపారు. ప్రభాకర్ రెడ్డి ఐదేళ్లుగా టీడీపీ మండల కన్వీనర్‌గా, మరో మూడేళ్లుగా రాష్ట్ర రైతు సంఘం సభ్యునిగా పని చేసి పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోవిందరెడ్డి, పెరుగు పురుషోత్తంరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, మోహన్ రెడ్డి, బైరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, సుధాకర్‌రావు, చదువుల సుదాకర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, బ్రాహ్మణపల్లి నాగిరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, రామకోటేశ్వరరావు, టీడీపీ, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

జూడో మార్షల్ ఆర్ట్స్ పోటీలు ప్రారంభం



మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారులతో డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు(స్పోర్ట్స్), జూలై 14: కర్నూలు కొత్తబస్టాండు ఎదురుగా ఉన్న హుసేన్‌ఖాన్ బిల్డింగ్‌లో ఏర్పాటు చేసిన జూడో మార్షల్ ఆర్ట్స్ పోటీలను సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకర్‌శర్మ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూడో లాంటి మార్షల్ ఆర్ట్స్‌లో సాధన చేయడం వల్ల క్రమశిక్షణ ఏకాగ్రత పెరిగి చదువులోనూ రాణిస్తారన్నారు. కార్యక్రమంలో జూడో మార్షల్ ఆర్ట్స్ శిక్షకుడు షఖీల్ పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌కు అభినందన



హెడ్‌కానిస్టేబుల్ ఖాజా హుసేన్‌కు రివార్డు అందజేస్తున్న ఎస్పీ

కర్నూలు, జూలై 14: వెల్దుర్తి సర్కిల్‌లో పని చేస్తున్న స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ ఖాజా హుసేన్‌ను ఎస్పీ జి.కృష్ణకాంత్ ప్రత్యేక అభినందించారు. ఆదివారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయనను అభినందించి రూ.1,000 రివార్డు అందించారు. ఎన్నికల సమయంలో హెడ్ కానిస్టేబుల్ ఖాజా హుసేన్ చేసిన కృషి ఫలితంగా రూ.2.30 కోట్ల నగదు, 4.5 కిలోల బంగారు ఆభరణాలు, 5 కిలోల వెండి పట్టుబడింది. ముందస్తు సమాచారాన్ని ఎప్పటికప్పుడు పోలీసు ఉన్నతాధికారులకు చేరవేసి విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచాడు. అలాగే 16 మోటారు సైకిళ్ల చోరీ కేసు రికవరీలో ఈయన కీలక పాత్ర పోషించాడు. ఈ సందర్భంగా ఎస్పీ ఆయనను అభినందించారు. ఎస్‌బీ సీఐలు నాగరాజు యా దవ్, ప్రసాద్, డీసీఆర్‌బీ సీఐలు గుణశేఖర్, రామయ్యనాయుడు పాల్గొన్నారు.

జిల్లా సాంస్కృతిక మండలిని పునరుద్ధరించాలి

కర్నూలు(కల్చరల్), జూలై 14: జిల్లా సాంస్కృతిక మండలిని పునరుద్ధరించాలని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య కోరారు. ఆదివారం నంద్యాల జిల్లాకేంద్రంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను ఆయన సత్కరించి, వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సాంస్కృతిక మండలి మూతపడి, కళాకారులకు సాయం అందడం లేదని అన్నారు. అలాగే టీడీపీ ప్రభుత్వంలో ప్రవేశ పెట్టిన నంది నాటక పోటీలను తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి స్పందిస్తూ కళాకారుల సమస్యలను అధికారులతో చర్చించి పరిష్కరించేలా చూస్తామని హామీ ఇచ్చారని పత్తి ఓబులయ్య తెలిపారు.

బాలిక ఆచూకీ కనుక్కోవాలి



మాట్లాడుతున్న బత్తుల లక్ష్మీకాంతయ్య

కర్నూలు(అర్బన్), జూలై 14: పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామానికి చెందిన బాలిక వాసంతి ఆచూకీ కనుక్కోవాలని బీసీ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల లక్ష్మీకాంతయ్య డిమాండ్ చేశారు. ఆదివారం కర్నూలు నగరంలో డీఐజీ విజయరావును బీసీ, వాల్మీకి సంఘాల నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. బత్తుల లక్ష్మీకాంతయ్య మాట్లాడుతూ బోయ వాసంతి అదృశ్యమై 8 రోజులు కావస్తున్నా మిస్టరీని ఛేదించలేక పోతున్నారన్నారు. బాలికను హత్య చేసిన నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా గ్రంథాయలం మాజీ చైర్మన్ సుభాష్ చంద్రబోస్, బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవపూజ ధనుంజయ్ ఆచారి, వాల్మీకి సంఘం నాయకులు శ్రీనివాసులు నాయుడు, బాలసంజన్న పాల్గొన్నారు.

కల్లూరులో గౌరు చరిత విజయోత్సవ ర్యాలీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, జూలై 14: పాణ్యం నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యేగా 40,591 ఓట్ల భారీ మెజార్టీతో గెలిచిన గౌరు చరిత కల్లూరులో భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఆదివారం కురువ సంఘం, ఆధ్వర్యంలో 33వ వార్డు పాత కల్లూరులో ఎమ్మెల్యే గౌరు చరితకు ఘన స్వాగతం పలికారు. ముందుగా ఊరువాకిలి నుంచి ఊరేగింపుగా వెళ్లి ఈశ్వర, వీరభద్ర, ఆంజనేయ, నీలకంఠేశ్వర, మారెమ్మ ఆలయాల్లో ఆమె ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ ఎన్నికల్లో ఇంతటి ఘనవిజయం అందించిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కల్లూరు సింగిల్‌విండో మాజీ చైర్మన్ రామకృష్ణ, రైతుసంఘం అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, ముస్లిం మైనారిటీ నాయకుడు ఎస్.ఫిరోజ్, కురువ శ్రీనివాసులు, పవన్‌కు మార్, శేషసాయి, బీరప్ప, సులేమాన్, మాలిక్ బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ విజేతలు వీరే..



విజేతలతో సెట్కూరు సీఈవో రమణ

కర్నూలు(స్పోర్ట్స్), జూలై 14: 9వ రాష్ట్ర స్థాయి (బాలబాలికలు) స్విమ్మింగ్ పూల్ విజేతలను నిర్వాహక కార్యదర్శి రామకృష్ణ ప్రకటించారు. గ్రూప్-1 బాలుర వ్యక్తిగత చాంపియన్‌షిప్‌గా కృష్ణా జిల్లాకు చెందిన సంపత్ కుమార్ యాదవ్ బాలికల విభాగంలో ఎన్టీఆర్ జిల్లాకు చెందిన పావని సరయు 25 పాయింట్లతో చాంపియన్‌గా నిలిచారు. అలాగే గ్రూప్-2 బాలుర విభాగంలో ఎన్టీఆర్ జిల్లాకు చెందిన యజ్ఞసాయ్ బాపట్లకు చెందిన సీహెచ్ అవిజ్ఞ, కే.లాస్యశ్రీ 25 పాయింట్లతో చాంపియన్లుగా నిలిచారు. గ్రూప్-3 బాలుర విభాగంలో వైఎస్సార్ జిల్లాకు చెందిన త్రిభువన్ రెడ్డి, బాలికల విభాగంలో కృష్ణా జిల్లాకు చెందిన యమర్తి పర్ణని 25 పాయింట్లతో వ్యక్తిగత చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు.

● **ఓవరాల్ చాంపియన్‌షిప్ ఎన్టీఆర్ జిల్లా కైవసం:** సబ్ జూనియర్, జూనియర్ రాష్ట్ర స్విమ్మింగ్ పోటీల్లో వివిధ ఈవెంట్లలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎన్టీఆర్ జిల్లా 227 పాయింట్లతో ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకుంది. 30 బంగారు, 21 వెండి, 14 కాంస్య పతకాలతో ప్రథమ స్థానం సాధించారు. రెండో స్థానంలో విశాఖపట్నం 10 గోల్డ్, 15 సిల్వర్, 6 బ్రాంజ్ 101 పాయింట్లతో, మూడో స్థానంలో 89 పాయింట్లతో కృష్ణా జిల్లా నిలిచింది. 10 బంగారు, 15 వెండి, 6 కాంస్యం పతకాలు సాధించారు. విజేతలకు న్యాయవాది శ్రీధర్ రెడ్డి, డాక్టర్ వాసురెడ్డి, సెట్కూరు సీఈవో రమణ, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావులు మెడల్స్ ప్రశంసాపత్రాలు అందజేశారు.

వేమూరి కనకదుర్గ ఆత్మకు శాంతి చేకూరాలి



వేమూరి కనకదుర్గ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మీసాల సుమలత తదితరులు

కర్నూలు(న్యూసిటీ), జూలై 14: ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సంస్థల పురోభివృద్ధిలో ఫైనాన్స్ డైరెక్టర్‌గా మీడియా హౌస్‌ను విజయవంతంగా నడిపిన దివంగత వేమూరి కనకదుర్గ ఆత్మకు శాంతి కలగాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా ఐక్యవేదిక నగర అధ్యక్షురాలు మీసాల సుమలత అన్నారు. ఆదివారం 48వ వార్డు రోజావీధిలో దివంగత వేమూరి కనక దుర్గ 66వ జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుమలత మాట్లాడుతూ సంస్థల అభివృద్ధికి కృషి చేయడంతోపాటు సంక్షేమానికి పాటుపడ్డారని అన్నారు. సంస్థలను ముందుకు నడుపుతూ ఉద్యోగులను సొంత బిడ్డల్లా చూసుకున్న ఆమె సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ కుటుంబానికి దేవుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో కర్రెమ్మ, సుంకులమ్మ, విశ్వదిరామ్, బోమ నాగన్న, ఆంజనేయులు, రాముడు పాల్గొన్నారు.

'రోపా' సేవలు మరింత విస్తృతం



రోపా ప్రతినిధులను అభినందిస్తున్న సంఘం నాయకులు

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), జూలై 14: రోపా (రాయల్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్) సేవలను మరింత విస్తృతం చేస్తామని ఆ సంఘం ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షుడు చింతలపల్లి రామకృష్ణ అన్నారు. ఆదివారం బిర్లా కాంపౌండ్‌లోని సాయివసంత్ కాంప్లెక్స్‌లో రోపా కార్యాలయంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కోనేటి వెంకటేశ్వర్లు, కోశాధికారిగా అంచ పెద్దస్వామిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చింతలపల్లి రామకృష్ణ మాట్లాడుతూ పలు విభాగాల్లో ప్రతిభ, నైపుణ్యం కల్గిన సంఘీయుల సలహాలు, సహకారంతో సంఘం సేవలను అందరికీ అందేలా కార్యాచరణ రూపొందిస్తామన్నారు. అనంతరం ప్రధాన కార్యదర్శి కోనేటి వెంకటేశ్వర్లు, కోశాధికారి పెద్దస్వామి, న్యాయ సలహాదారుడు సీవీ శ్రీనివాసులు మాట్లాడారు. ఈ సందర్భంగా బలిజ సంఘం సీనియర్ నాయ కుడు అర్జా రామకృష్ణ నూతన కార్యవర్గాన్ని పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో రోపా సభ్యులు జి.శ్రీని వాస్, కొణిదెల శ్రీనివాస్, చంద్రమోహన్, మధుసూదన్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జీపీఎస్ గెజిట్‌ను రద్దు చేయాలి: ఎస్టీయూ



మాట్లాడుతున్న ఎస్ గోకారి

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 14: రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి సీపీఎస్‌ను రద్దు చేసి దాని స్థానంలో జీపీఎస్ గెజిట్ విడుదల చేయడం సమంజసం కాదని, వెంటనే ఉత్తర్వులను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సలాంఖాన్ ఎస్టీయూ భవనంలో సురేష్ అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం జీపీఎస్‌పై గెజిట్ జీవో 54ను విడుదల చేయడాన్ని తాము ఖండిస్తున్నా మన్నారు. వెంటనే ఈ జీవోను రద్దు చేయాలన్నారు. అందరికీ ఆమోదయోగ్యమైన ఎటువంటి కాంట్రిబ్యూషన్ లేనటువంటి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శేఖర్, ధనుంజయ, రామాంజనేయులు, గోవిందు పాల్గొన్నారు.

పశు పోషకులకు శుభవార్త

మంత్రి అచ్చెన్నాయుడికి కృతజ్ఞతలు తెలిపిన వై.నాగేశ్వరరావు యాదవ్

కర్నూలు(అగ్రికల్చర్), జూలై 14: వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు పశు పోషకులకు శుభవార్త అందించారు. టీడీపీ ప్రభుత్వం పాడి, గొర్రెలు, మేకల పెంపకం ద్వారా జీవనోపాధి పొందుతున్న వారికి కచ్చితంగా కేంద్ర సాయంతో ప్రయోజనాలు అందిస్తామని శనివారం ప్రకటించడంపై గొర్రెలు, మేకల పెంపకందారుల ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా వీరికి 90 శాతం రాయితీపై షెడ్లు ఏర్పాటు చేసుకునేందుకు చర్యలు చేపడుతామని అచ్చెన్నాయుడు ప్రకటించడంపై నాగేశ్వరరావు యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పశు పోషకులకు 90 శాతం రాయితీపై ఒక్కో షెడ్డుకు గరిష్ఠంగా రూ.2.30 లక్షలు, గొర్రెలు, మేకల షెడ్లకు 70 శాతం రాయితీపై గరిష్ఠంగా యూనిట్‌కు రూ.2.30 లక్షలు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కోళ్ల పెంపకందారుల కోసం ఒక్కో షెడ్డు నిర్మాణానికి 70 శాతం రాయితీపై గరిష్ఠంగా యూనిట్‌కు రూ.1.32 లక్షలు ఇవ్వనుందని త్వరలోనే ఈ పథకానికి సంబంధించి మార్గదర్శకాలు విడుదల చేస్తున్నట్లు ప్రకటించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

పరిశ్రమలు స్థాపించి ఉపాధి కల్పించాలి : డీవైఎఫ్ఐ



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగేష్

ఆదోని (అగ్రికల్చర్), జూలై 14: ఒకప్పటి రెండవ ముంబాయిగా ఉన్న ఆదోనిలో పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి కల్పించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ కోరారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు వీరేష్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండో ముంబైగా పేరుగాంచిన ఆదోని నేడు ఉపాధి కరువై వలసలు వెళుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్రానికి ప్రత్యేక హోదా విభజన హామీలు సాధిస్తే పరిశ్రమలు వస్తాయని దీంతో ఉపాధి కల్పించే అవకాశం ఉంటుందన్నారు. నాయకులు వెంకటేష్, సంజీవ్, వసంత, మల్లి, బాస్కర్, శ్రీరామ్ పాల్గొన్నారు.

దేవరగట్టు ప్రాంతాన్ని పర్యటక కేంద్రంగా మార్చాలి

● మంత్రి కందుల దుర్గేశ్‌కు జనసేన నాయకుల వినతి


మంత్రి కందుల దుర్గేశ్‌కు వినతిపత్రం అందిస్తున్న జనసేన పార్టీ ఐటీ కోఆర్డినేటర్ రంజిత్

ఆలూరు, జూలై 14: ఆలూరు ప్రాంతంలో ఉన్న దేవరగట్టు ప్రాంతంలో జింకల పార్క్ ఏర్పాటు చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ఆదివారం నంద్యాల జిల్లాకు వచ్చిన రాష్ట్ర పర్యటకశాఖ, సినిమాటో గ్రఫీ మంత్రి కందుల దుర్గేష్‌ను కలసి విన్నవించినట్లు జనసన పార్టీ ఐటీ కోఆర్డినేటర్ రంజిత్ తెలిపారు. మండల కేంద్రాల్లో ఆహ్లాదం కోసం పార్క్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. మంత్రిని కలసి వారిలో ఆరు మండలాల కన్వీనర్లు చత్రపతి, అరవింద్, చంద్ర, అశోఖ్, బడేసబ్, జగదీష్, చంటి, రిటైర్డ్ హెడ్మాస్టర్ ఉచిరప్ప, ఎక్స్ ఆర్మీ రామాంజనేయులు, జనసైనికులు శేఖర్, మహేష్, రాజు ఉన్నారు.

14ఏడీఎన్5 : మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి టీ గాదలింగప్ప

జీపీఎస్ గెజిట్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలి

ఆదోని (అగ్రికల్చర్), జూలై 14: సీపీఎస్ స్థానంలో జీపీఎస్ అమలు కోసం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ వెంటనే రద్దు చేయాలని యుటీఎఫ్ జిల్లా కార్యదర్శి గాదిలింగప్ప డిమాండ్ చేశారు. ఆదివారం యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ రద్దు కోసం గత 20 ఏళ్లుగా అనేక పోరాటాలు చేస్తూ ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చామన్నారు. రాజకీయ పార్టీలు సీపీఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే హామీలు విస్మరిస్తున్నారు. జీవో నెంబర్ 54 ద్వారా సీపీఎస్ స్థానంలో జీపీఎస్ తీసుకురావడానికి తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. వెంటనే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు శ్రీనివాసులు, మల్లికార్జున, రామాంజనేయులు, నారాయణ, మల్లయ్య, నగేష్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానంతోనే ఉద్యోగులకు న్యాయం

ఆదోని (అగ్రికల్చర్), జూలై 14: ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానంతోనే న్యాయం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాలూకా అధ్యక్షుడు అన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఏడాదికి ముందు ఎన్నికల ప్రచారాల్లో మాజీ సీఎం జగన్మోన్ రెడ్డి ఉద్యోగులకు సీపీఎస్ రద్దు చేస్తానని హామీ ఇచ్చి మోసం చేశారన్నారు. అందుకే ఉద్యోగులంతా జగన్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పామన్నారు. సీపీఎస్ రద్దు చేయకపోగా జీపీఎస్ అంటూ అసెంబ్లీలో చట్టం తేవడం దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వం జీపీఎస్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించుకొని సీపీఎస్ స్థానంలో ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, ట్రెజరర్ లక్ష్మీ, నాగ, రవి వైస్ ప్రెసిడెంట్ ఎల్లయ్య , సైలెస్ పాల్గొన్నారు.

ఘనంగా విద్యార్థి శతకం పుస్తకావిష్కరణ


పుస్తకావిష్కరణ చేస్తున్న రాజకీయ ఉపాధ్యాయ సంఘాల నాయకులు

పత్తికొండ టౌన్, జూలై 14: ప్రధానోపాధ్యాయులు హనుమంతు నాయుడు సామాజిక స్పృహతో రచించిన విద్యార్థి శతకం పుస్తకావిష్కరణ ఉపాధ్యాయ సంఘాల మధ్య అట్టహాసంగా జరిగింది. ఆదివారం స్థానిక రమ్య రిసార్ట్‌లో దేవనబండ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులుగా సేవలందించిన హనుమంత నాయుడు పదవి విరమణ సందర్భంగా రాజకీయ నాయకులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు హనుమంతనాయుడు దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డి, కేడీసీసీ మాజీ వైస్ చైర్మన్ రామచంద్రరెడ్డి, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ, సీపీఐ జిల్లా నాయకులు నబీ రసూల్, ఆరసం జిల్లా కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆదోని జిల్లా ఏర్పాటుతోనే అభివృద్ధి


పల్లా శ్రీనివాస్‌ను కలిసిన ఆడా అధ్యక్షుడు ఆదినారాయణ

ఆదోని టౌన్, జూలై 14: విద్యా వైద్యం, వ్యాపార, పారిశ్రామిక రంగాలలో పూర్తిగా వెనుకబడిన ఆదోని పట్టణాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటిస్తే తప్ప అభివృద్ధికు సాధ్యం లేదని ఆదోని ఏరియా డెవలప్మెంట్ అసోసియేషన్ (ఆడా) అధ్యక్షుడు ఆదినారాయణ అన్నారు. ఆదివారం విజయవాడలో సీఎం చంద్రబాబు నాయుడు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసులను కలిసి ఈ మేరకు వినతిపత్రం ఇచ్చారు. విభిన్న సంస్కృతులు, అల్ప సంఖ్యాక భాష (తెలుగు, కన్నడ, మరాఠి, గుజరాతి) వర్గాలకు నిలయమైన చారిత్రక ప్రాముఖ్యత కలిగి, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దటానికి అవకాశం ఉన్నా, ఆదోని ప్రాంతాన్ని, ఆదోని ఏరియా డెవలప్మెంట్ అథారిటీగా అప్పటి సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రకటన చేశారు కాని, తిరిగి ఆ ఊసే ఎత్తక పోవడంతో ఈ ప్రాంతం అభివృద్ధిలో మరింతగా దిగజారిందని విమర్శించారు. కొత్త జిల్లాల ఏర్పాటు కోసం 2019లో ఉద్యమాలు జరుగుతున్న సందర్భంగా జిల్లా ఏర్పాటు కోసం కృషి చేస్తానని రాతపూర్వకంగా రాసి ఇచ్చిన అప్పటి వైసీపీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, కనీసం దీక్షా శిబిరానికి కూడా రాకుండా పత్తా లేకుండా పోయారని విమర్శించారు. కనీసం ఇప్పుడైనా ఆదోనిను జిల్లాగా ప్రకటించి పశ్చిమ ప్రాంత అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరామని తెలిపారు.

కంది పంటను దున్నేశారు..

● రూ.లక్ష నష్టం ● పోలీస్ స్టేషన్‌లో బాధితుడి ఫిర్యాదు

మద్దికెర, జూలై 14: మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామానికి చెందిన కటిగేరి రాజు అనే రైతుకు చెందిన పొలంలో సాగు చేసిన కంది పంటను శనివారం ట్రాక్టరుతో దౌర్జన్యంగా దున్నేయడంతో రూ.లక్ష దాకా నష్టం వాటిల్లింది. బాధితుడి వివరాల మేరకు.. ఎం.అగ్రహారం గ్రామానికి చెందిన కటిగేరి రాజు హంపా గ్రామ పంచాయతీలో సర్వే.నెం.276లో మూడెకరాల పొలంలో కంది పంటను సాగు చేస్తున్నారు. పంట ఆశాజనకంగా వచ్చింది. గుంతకల్లు పట్టణానికి చెందిన రమేష్‌బాబు హంపా గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ, కోదండరాముడు దౌర్జన్యంగా హంపాకు చెందిన భీమన్న ట్రాక్టరును తీసుకెళ్లి పైరును మొత్తం దున్నేశాడు. ఈ విషయంపై వారిని ప్రశ్నించేందుకు వెళ్లగా దౌర్జన్యం చేయడమే కాకుండా బెదిరింపులకు పాల్పడ్డాడు. పంట నష్టం కావడంతో ఎస్ఐ రమేష్‌బాబుకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. వారిపై కఠిన చర్యలు తీసుకుని పరిహారం అందించాలని కోరారు. అంతేగాక వారి నుంచి తనకు ప్రాణహానీ ఉందని ఫిర్యాదు చేశారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ఎస్ఐ దర్యాప్తు చేస్తున్నారు.

పిచ్చికుక్క స్వైర విహారం



పిచ్చికుక్క దాడిలో గాయాలపాలైన బాలుడు రాము

ఆదోని, జూలై 14: ఆదోని పట్టణంలోని రాజీవ్ గాంధీనగర్‌లో పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. కాలనీవాసులు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ క్రమంలో ఓ ఇంటి ముందు ఆడుకుంటున్న ఆరేళ్ల రాము అనే బాలుడిపై పిచ్చికుక్క దాడి చేసింది. దీంతో ఆ బాలుడి తలకు తీవ్ర గాయాలు కావడంతో తల్లిదండ్రులు హుటాహుటీనా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా బాలుడు తండ్రి మాట్లాడుతూ రాజీవ్ గాంధీనగర్‌లో సుమారు 200 పైగా కుక్కలు ఉన్నాయని, అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నూతనంగా ఎంపికైన ఎమ్మెల్యే పార్థసారథి ఈ విషయం పై చర్యలు చేపట్టాలని కోరారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం


గోనెగండ్ల ఉన్నత పాఠశాలలో కలిసిన 25 ఏళ్లనాటి పూర్వపు విద్యార్థులు

గోనెగండ్ల/ తుగ్గలి జూలై 14: స్థానిక ఉన్నత పాఠశాలలో ఆదివారం 1998-99లో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అపూర్వంగా జరిగింది. పాతికేళ్ల తరువాత కలవడంతో కొందరు ఉద్వేగానికి లోనయ్యారు. నాటి ఉపాధ్యాయులను ఆత్మీయంగా కలుసుకొని వారిని గౌరవించారు. పాతికేళ్ల తరువాత ఉద్యోగాలు, సంసారజీవితంలో బిజీగా ఉంటున్న వీరంతా ఒక్కచోటికి చేరి సందడి చేశారు. అలనాటి ఉపాధ్యాయులు వెంకటరమణ, అన్వర్, రాఘవరెడ్డి, ఉరుకుందు, ఉస్మాన్, శ్రీనివాసులు, లక్ష్మీకాంత, శంకరయ్య, రామాంజినేయులు హాజరయ్యారు. ఉపాధ్యాయులను శాలువ, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు ఖాజబందేనవాజ్, షాషావలి, వలి, జాకీర్‌హుసేన్, బడేషావలి, షఫి, రంగస్వామి, చాంద్‌బాషా, విమల, అనిత, రసూబీ, రమీజాబీ, పాల్గొన్నారు.


పెండేకల్ ఆర్ఎస్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పెండేకల్ ఆర్ఎస్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తుగ్గలి మండల పరిధిలోని పెండేకల్ ఆర్ఎస్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 2000-2005 సంవత్సరంలో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు 20 ఏళ్ల తర్వాత పాఠశాలలో కలుసుకుని సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో పని చేస్తూ బిజీగా ఉన్న వారంతా ఒక్కచోటికి చేరి ఆనాటి మధురానుభూతులను నెమరేసుకున్నారు. విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులు హుశేన్‌సాబ్, భూషప్ప, సురేష్‌బాబు, వెంకటరమణ, ఉపేంద్ర, శ్రీనివాసులు, రంగస్వామి, వెంకమ్మను ఘనంగా సన్మానించారు. అలాగే పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి అభివృద్ధి పనులకు నాంది పలికారు. అలాగే తమతో పాటు చదువుకొని మృతి చెందిన తోటి స్నేహితుల కుటుంబాలకు ఆర్థిక తోడ్పాటు అందించి అండగా ఉంటామని పేర్కొన్నారు.

మంత్రాలయంలో భక్తుల కోలాహలం

మంత్రాలయం, జూలై 14 : రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో కోలాహలంగా మారింది. ఆదివారం సెలవు దినం కావటంతో దక్షణాది రాష్ట్రాలనుంచి వే లాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగాణం భక్తులతో కిక్కిరిసింది. మఠం అతిథి గృహలు, ప్రైవేట్ లాడ్జీలు భక్తులతో నిండిపోయాయి. అద్దె రూములు దొరకక మధ్వమార్గ్ కారిడార్ ముందే భక్తులు బసచేశారు.

శ్రీ మఠం గోశాల, అన్నదానంకు రూ.లక్ష విరాళం : రాఘవేంద్ర స్వామి మఠానికి మైసూరుకు చెందిన వసంత కుమార్ అనేభక్తుడు రూ.50 వేలు గోసంరక్షణకు, రూ.50 వేలు అన్నదానంకు విరాళం ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి తెలిపారు.

శిలామండపానికి బంగారు పూత పనులు : రాఘవేంద్రస్వామి గర్భగుడి శిలామండపానికి తూర్పు వైపున బంగారు పూత రేకులు అమర్చే పనులు జోరుగా సాగుతున్నాయి. మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో భక్తుల నుంచి వచ్చిన బంగారంతో బెంగుళూరుకు చెందిన శంకర్ ఎలక్ట్రికల్స్ రూ.6వేల కేజీల రాయిని విరాళంగా ఇచ్చారు. బెంగుళూరుకు చెందిన శ్రీనివాస్ ప్రముఖ శిల్పి కళాకారుల బృందం ఆధ్వర్యంలో ఈ పనులు చురుగ్గా సాగుతున్నాయి.


మఠం ప్రాంగాణంలో భక్తుల రద్దీగా ఉన్న దృశ్యం

శ్రీమఠం చేరుకున్న మంత్రాలయం పీఠాధిపతి : రాఘవేంద్రస్వామి పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ధార్మిక పర్యటనను ముగించుకుని ఆదివారం మంత్రాలయం చేరుకున్నారు. పదిహేను రోజులుగా రామేశ్వరం, తాంజావూరు, గోవా, కుంభకోణం, హోసరుత్తి, బెంగుళూరు, గంగావతి, ముంబై, పూణే తదితర ప్రాంతాల్లో పర్యటించి అక్కడ ప్రత్యేక పూజలు చేసిన విషయం తెలిసిందే.

రాఘవేంద్రుని సన్నిధిలో ప్రముఖులు : రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్ణాటక రాష్ట్ర ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ రవీంద్ర, ప్రముఖ సీరియల్ నటీ శోభా శెట్టి కుటుంబ సమేతంగా వేర్వేరు సమయాల్లో రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. శ్రీమఠం మహాముఖ ద్వారం వద్ద మఠం మేనేజర్లు ఎస్ కే శ్రీనివాసరావు, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహామూర్తి లు ఘనంగా స్వాగతం పలికారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక

ఆదోని, జూలై 14: మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ఆదివారం నారాయణపురం మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వైసీపీ నుంచి మాజీ ఎంపీటీసీ ఆనంద్, మల్లి, గర్జన్న, అనిల్, విజయ్, గోపాల్, అజయ్, నాగరాజ్, జాన్, బజారి, రంగన్నలను మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. గ్రామానికి వచ్చిన 14,15 ఫైనాన్స్ నిధులను కూడా వైసీపీ ప్రభుత్వమే దొంగ చాటున దారి మళ్లించిందన్నారు. గ్రామంలో 21 రోజులు తాగునీరు లేకపోయినా సంబంధిత అధికారులు, సర్పంచు పట్టించుకోలేదని వాపోయారు. తాగునీరు రావడంలేదని తన దృష్టికి వచ్చిన వెంటనే పైపులైనుకు మరమ్మతులు చేయించి వెంటనే అందించామని అన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణపురం టీడీపీ నాయకులు ఎంపీటీసీ కరెప్ప, మల్లికార్జున రెడ్డి, చంద్ర, నాగప్ప, శేఖర్, భీమిలింగ పాల్గొన్నారు.


మీనాక్షి నాయడు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

వైసీపీ నుండి బీజేపీలో చేరిక

పట్టణంలోని 35వ వార్డు కౌన్సిలర్ లలితా మధుసూదన శర్మ ఆధ్వర్యంలో బాస్కరరెడ్డి కాలనీ, భీమిరెడ్డి కాలనీ, వైఎస్సార్ నగర్ కాలనీలోని వైసీపీ కుటుంబాలు రాష్ట్ర మత్స్యకార సంఘం రాష్ట్ర కార్యదర్శి పగడాల నీలకంఠ బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. వారందరికీ ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి బీజేపీ పార్టీ కండవాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. మాజీ ఎంపీపీ పంపాపతి, బీజేపీ పట్టణ అధ్యక్షులు జిందే సాయి, మధుమాధవ్, కౌన్సిలర్ చిన్న, సురేష్, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

కటారుకొండ కొండలలో చిరుత సంచారం

క్రిష్ణగిరి, జూలై 14: కటారుకొండ ఫారెస్ట్ రేంజ్ పరిధిలో చిరుత పులి సంచరిస్తున్నట్లు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రామచంద్రుడు, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ కాళిదాసు ఆదివారం తెలిపారు. చిరుత పులి దాడిలో జింక మృతి చెందిన సంఘటనను చిరుత పులి పాద ముద్రల ద్వారా(ప్లగ్ మార్క్) ఫారెస్ట్ అధికారులు ధ్రువీకరించారు. చిరుతపులి దాడిలో మృతి చెందిన జింకకు పంచనామ నిర్వహించి దహనం చేసారు. కటారుకొండ ఫారెస్ట్ రేంజ్ పరిదిలోని గ్రామాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

మద్దికెరలో రైళ్లు నిలిపేలా చూడాలి


ఎంపీ నాగరాజుకు వినతి పత్రం ఇస్తున్ననాయకులు

మద్దికెర, జూలై 14: మద్దికెర నుంచి కర్నూలు వరకు ప్యాసింజర్ రైళ్లు తిరగడం లేదని, అలాగే ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపడం లేదని సీనియర్ టీడీపీ నాయకులు, రిటైర్డు ఉద్యోగి నగిరి కిష్టన్న యాదవ్ కోరారు. ఆదివారం ఆంధ్రజ్యోతిలో రాకపోకలు ఎలా అనే వార్తను ఎంపీ బస్తిపాటి నాగరాజు దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్దికెర రైల్వేస్టేషన్‌లో మూడేళ్ల నుంచి ఎక్స్‌ప్రెస్ రైళ్లను అమరావతి, కాచిగూడ, యశ్వంత్‌పూర్ రైళ్లను నిలపడం లేదన్నారు. అలాగే మద్దికెర నుంచి కర్నూలు, కాచిగూడ, డోన్, విజయవాడ ప్యాసింజర్ రైళ్లు తిరగకపోవడం వల్ల రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు . కార్యక్రమంలో 1999 సంవత్సరం పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

బాలనాగిరెడ్డి అవినీతిపై సీఐడీ విచారణ జరిపించాలి

కోసిగి, జూలై 14: మంత్రాలయం వైసీపీ ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, ఆయన కుటుంబ సభ్యుల అవినీతిపై సీఐడీతో విచారణ చేయాలని టీడీపీ కర్నూలు పార్లమెంటు ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, తోవి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం పల్లెపాడులో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చి నెల రోజులు కాకముందే కోసిగి మండల టీడీపీ నాయకులపై లేనిపోని అబాండాలు వేయడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. మంత్రాలయం ఎమ్మెల్యేగా నాలుగుసార్లు గెలిచిన బాలనాగిరెడ్డి నియోజకవర్గానికి, కోసిగి మండలానికి ఏమి అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. మురళిరెడ్డికి రూ.కోట్లలో డబ్బులు ఎలా వచ్చిందో.. ఇల్లును ఎలా నిర్మించుకున్నారో అందరికీ తెలుసని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ జ్ఞానేష్, నాయకులు నాడిగేని అయ్యన్న, చిన్న తాయన్న, ఈరేష్, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ఖాజా హుస్సేన్‌కు రివార్డు


హెడ్ కానిస్టేబుల్‌ను అభినందిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

వెల్దుర్తి, జూలై, 14 : సార్వత్రిక ఎన్నికల సమయంలో సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేసి యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడంలో కీలకపాత్ర పోషించిన స్పెషల్ బ్రాంచి హెడ్ కానిస్టేబుల్ ఎస్.ఖాజాహుస్సేన్‌ను ఎస్పీ కృష్ణకాంత్ నగదు రివార్డుతో ఆదివారం సత్కరించారు. ఎన్నికల ముందు భారీ ఎత్తున నగదు రూ.2.35 కోట్లు, 4.5 కేజీల బంగారు, 5 కేజీల వెండి, రాష్ట్రంలో దొంగిలించబడిన 16 ద్విచక్ర వాహనాలను రికవరీ చేయడంలో ఎప్పటికప్పుడు వాస్తవాలను సేకరించి ఉన్నత అధికారులకు తెలియజేయడంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ నాగరాజు యాదవ్, కోసిగి సీఐ ప్రసాద్, డిసిఆర్‌బి సీఐ గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అండగా నిలిచిన పూర్వ విద్యార్థులు

● స్నేహితుని కుటుంబానికి రూ.1.28 లక్షల ఆర్థిక సాయం


స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

మద్దికెర, జూన్ 14: మద్దికెర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997-98 పదవ తరగతి పూర్వ విద్యార్థులు తమ స్నేహితుని కుటుంబానికి అండగా నిలిచారు. స్థానిక జెండాకట్ట వీధిలో నివాసముంటున్న స్నేహితుడు టైలర్ వలి ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురై మృతి చెందాడు. ఆయన కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న పూర్వ విద్యార్థులు రూ.1.28 లక్షను పోగు చేసి స్నేహితుని కుటుంబానికి ఆదివారం అందజేశారు. భవిష్యత్తులో ఆయన కుటుంబానికి అండగా ఉంటామన్నారు. మిత్రులందరూ విరాళం ఇచ్చినందుకు ఆయన కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్లపై పశువులను వదిలితే గోశాలకు తరలిస్తాం

ఆలూరు, జూలై 14: పశువులను రోడ్ల పైకి వదలడం ద్వారా ప్రధాన రహదారిలో అడ్డదిడ్డంగా కూర్చుంటున్నాయని, దీంతో వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారిందని ఈఓపీఆర్‌డీ ప్రకాష్ నాయుడు అన్నారు. పశువులను రోడ్లపైకి వదలడం ద్వారా వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారుతుందన్నారు. అలాగే వదిలితే వాటిని ఆదోనిలోని గోశాలకు తరలిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా వీధుల్లో పంచాయతీ సిబ్బంది మైక్‌ల ద్వారా ప్రచారం చేశారు.

ఆర్థిక బకాయిలను విడుదల చేయాలి

ఆదోని (అగ్రికల్చర్), జూలై 14: ఉద్యోగ ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలను వేంటనే విడుదల చేయాలని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి గోపాల్ కోరారు. ఆదివారం ఎస్టీయూ భవనంలో ఆదోని కౌతాళం మండల కార్యకర్తల సామవేశంలో చింతకుంట రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పీఆర్సీలో ఉద్యోగులను మోసం చేసిందని పెండింగ్ బకాయిలు చెల్లించకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం తమకు రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేసి న్యాయం చేయాలని కోరారు. జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న, నాయకులు సూర్యుడు, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ దేవాలయంలో చోరీ

గోనెగండ్ల, జూలై 14: గోనెగండ్ల, పెద్దమరివీడు గ్రామాల మధ్య ఉన్న ఎల్లమ్మ దేవాలయంలో శనివారం రాత్రి దొంగలు దేవాలయంలో చోరీ చేసినట్లు పోలీసులు తెలిపారు. రాత్రి దేవాలయం వాకిళ్లకు వేసిన తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించి హుండి పగలగొట్టి అందులో ఉన్న డబ్బును, వెండి ఆభరణాలను దోచుకువెళ్లారు. ఆదివారం ఉదయం దేవాలయానికి వెళ్లిన భక్తులు ఈ విషయాన్ని గమనించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హుండీలో ఉన్న నగదు, వెండి ఆభరణాలు చోరీ అయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నట్లు సీఐ రామకృష్ణయ్య తెలిపారు.

సహకార సంఘం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

దేవనకొండ, జూలై 14 : సహకార సంఘం ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణుడు, ఖాజామెద్దిన్ అన్నారు. స్థానిక పీఎస్ ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార ఉద్యోగుల మహాజన సమావేశం నిర్వహించారు. సమావేశంలో రహంతుల్లా, గోపాల్‌రెడ్డి, హరీఫ్ బాషా పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పత్తికొండలో బీసీ సంక్షేమ హాస్టల్ ఏర్పాటు చేయాలి

పత్తికొండ టౌన్, జూలై 14 : పత్తికొండలో బీసీ సంక్షేమవసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం స్థానిక ఈశ్వర్ రెడ్డి భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పత్తికొండలో బీసీ బాలుర వసతి గృహం లేకపోవడంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని బీసీ సంక్షేమ హాస్టల్‌ను నిర్మించడమే కాకుండా ప్రతి ప్రభుత్వ హాస్టల్‌లో సీట్ల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రవికుమార్, నాయకులు వంశి, కోటేశ్వర్, శశి తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి జనసేన క్రియాశీలక సభ్యత్వం నమోదు

పత్తికొండ టౌన్, జూలై 14: ఈ నెల 18 నుంచి జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం నమోదు కార్యక్రమం ప్రారంభమవుతుందని నియోజకవర్గ సమన్వయకర్త రాజశేఖర్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సభ్యత్వ నమోదు చేసుకుందాం.. మార్పుకు పునాది వేద్దాం అన్న ఆశయంతో సభ్యత్వ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. కష్టకాలంలో కుటుంబానికి ఆర్థిక పరమైన భవితవ్యానికి భరోసా కల్పించేలా సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

రాజకీయ వేధింపులకు పాల్పడలేదు

పత్తికొండ టౌన్, జూలై 14: చక్రాల గ్రామంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఎవరిపైనా రాజకీయ వేధింపులకు పాల్పడడం లేదని, ఓ ప్రజా సంఘం నాయకుడు పత్రికాముఖంగా చేసిన ఆరోపణలు అవాస్తవమని ఆ గ్రామ టీడీపీ నాయకులు, ఎంపీటీసీ మెంబరు రాజు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చాక అన్ని ప్రజా సమస్యల కోసమే గ్రామంలో పని చేస్తున్నామన్నారు. పొదుపు సంఘాలతో కలిసి పని చేస్తున్న వీవోలను అధికార పార్టీ నాయకులు తొలగిస్తూ రాజకీయ వేధింపులకు పాల్పడుతున్నారని ప్రజా సంఘాల నాయకులు చేస్తున్న తప్పుడు ఆరోపణలు మానుకోవాలని హితువు పలికారు.

చర్మకార వృత్తిదారులకు ఆరోగ్య బీమా కల్పించాలి

ఎమ్మిగనూరు, జూలై 14: గాలికి, దూళికి బతికే చర్మకార వృత్తిదారులకు ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని ఏపీ చర్మకార వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆనంద్ బాబు స్థానిక నాయకులు సుమాల ఆంథోని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని కేవీపీఎస్ కార్యలయంలో సంఘం సమావేశాన్ని నాయకులు కాలేబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అణగారిన వృత్తిదారుల ఆరోగ్యం కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, ప్రతి చర్మకార వృత్తిదారుడికి ఆరోగ్య బీమాను కల్పించాలని కోరారు. నాయకులు గుటెప్ప, శాంతి, బాస్కర్, శ్రీనివాసులు, ప్రభుదాస్, ఆనంద్, రంగన్న పాల్గొన్నారు.

కల్లుబావి కాలనీ అభివృద్ధికి కృషి చేస్తా : ఎమ్మెల్యే

ఆదోని, జూలై 14: కల్లుబావి కాలనీని అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. ఆదివారం జనసేన నాయకులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పాల్గొని మాట్లాడారు. రోడ్లు, డ్రైనేజీ కాలువలు, నీటి సమస్యను పరిష్కరిస్తానన్నారు. జనసేన నాయకులు మహేష్ యాదవ్, బీజేపీ నాయకులు వడ్డే శ్రీనివాసులు, ఉపేంద్ర కుమార్, అడ్వకేట్ లోకేష్ కుమార్, గోపాల్ ఆచారి పాల్గొన్నారు.

ఆలూరు అభివృద్ధికి నిధులు కేటాయించాలి


సీఎం చంద్రబాబును కలిసిన నాయకులు

చిప్పగిరి, జూలై 14: జిల్లాలో వెనుకబాటుకు గురైన ఆలూరును ఆదుకోవాలని, పెండింగ్లో ఉన్న నగర డోణ, వేదవతి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు నిధులు కేటాయించాలని చిప్పగిరి మాజీ జడ్పీటీసీ సభ్యులు ఏరూరు మీనాక్షి నాయుడు సీఎం చంద్రబాబు నాయుడును కోరారు. ఆదివారం మంగళగిరి టీడీపీ కార్యాలయంలో సీఎంను కలిసి విన్నవించారు. నియోజకవర్గంలో అధ్వాన్నంగా ఉన్న రహదారులను బాగు చేయించాలని కోరారు. పార్టీ కోసం నిస్వార్థంగా సేవలు అందిస్తున్న నాయకులకు నామినేటెడ్ పదవుల కేటాయింపులో ప్రాధాన్యత కల్పించాలని కోరగా.. ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు..